


# కాలజ్ఞానసుధ

ఆధ్యాత్మిక మాస పత్రిక

మార్చి - 2015 సంపుటి: 19 సంచిక: 3


## విషయ సూచిక


| | |
|---|---|
| సంపాదకీయం - ప్రశాంతతే పరమావధి | 4 |
| జ్ఞాన సుధ - నీటి బుడగ | 5 |
| వేద పరిచయము - ఋగ్వేద పరిచయం | 9 |
| ఆది గురువు ఆచార్య శంకరులు | 12 |
| మహాభారతంలోని - నీతి కథలు | 14 |
| సనాతన ధర్మము - దాని విశిష్టత (తృష్ణ లేక లోభం) | 16 |
| ఈశ్వరకటాక్షం | 18 |
| సుమతిత్వము | 20 |
| యోగవాసిష్ట కథాలహరి - ముగ్గురు రక్కసుల ముచ్చట | 21 |
| విశ్వాసముంటే విధినైన ఎదిరించవచ్చు | 23 |
| రఘువంశం | 26 |
| శ్రీకృష్ణ భక్తాగ్రగణ్యుడు - శ్రీ చైతన్య మహాప్రభువు | 27 |
| భగవద్గీతకు భాసురభాష్యం | 29 |
| అష్ట వినాయకులు - (దూమ్రవర్ణ) | 32 |
| దర్శనీయ దేవాలయాలు (పేరవరం) | 34 |
| వివిధ వ్యాధులు ఆయుర్వేద చికిత్సలు | 36 |
| వాస్తు - సైన్సు | 37 |


ముఖచిత్రం : శ్రీ సీతారాములవారు

### ఈ నెల సూక్తి

సంకల్పాలతో కూడిన మనస్సు గాలిలో పెట్టిన దీపం లాంటిది. అది స్థిరంగా ఉండదు. ఈ దేహం నుండి దూరంగా పారిపోవడానికే ప్రయత్నిస్తుంది. దానికి తపస్సు అనే అడ్డుగోడను కడితే తప్ప మన అధీనంలో ఉండదు.




### చందా వివరములు

జీవిత చందా(20సం॥) : 1116/-

సంవత్సర చందా : 70/-

చందాలు పంప వలసిన చిరునామా:

**కాలజ్ఞాన సుధ**

శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,
ఒంగోలు - 523 002 ప్రకాశం జిల్లా, (ఆం. ప్ర)
ఫోన్స్: 08592/235341, 9949132469,
9705555229, 8977799289

సంపాదకులు: శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారు

సంపాదకీయం

# ప్రశాంతతే పరమావధి

సుస్థిర సమాజం ఎంతో అవసరం. ఒడిదుడుకులులేక, ఆరాటాలు, పోరాటాలు లేక సవ్యంగా సాగిపోవాలి, మన సమాజం. అలా సాగిపోవాలంటే ప్రశాంతత కావాలి. అంటే ప్రశాంత వాతావరణం అవసరం.

పాలకులు పాలించబడే ప్రజలు సంయమనం పాటించాలి. నేటి మన సమాజంలో అశాంతి ఆవరించివున్నది. ప్రశాంతత కొరవడుచున్నది. దీనికి అనేక కారణాలు. మనిషి తన మానసిక పరిధిని విస్తరిస్తున్నాడు. తనకున్న దానిలో సంతృప్తి పడకపోవటం, ఎదుటివారిని చూచి వారిలాగా మనమూ వుండాలనే పోటీతత్వమును పెంచుకోవటం అతని అశాంతికి ముఖ్యకారణాలు కాగా తనను తాను సమీక్షించుకోకపోవటం మరో పెద్ద తప్పిదం. నిరుద్యోగి ఏదో ఒక ఉద్యోగం వస్తే చాలనుకుంటాడు. ఓ పదివేల రూపాయలు జీతం గలిగిన ఉద్యోగం వస్తే అమ్మయ్య ఉద్యోగం వచ్చింది అని సంబరపడిపోతాడు. కొంతకాలం గడువగా తనకన్న పై ఉద్యోగిని పోటీపెట్టుకొని నాకుకూడా అంత జీతం వస్తే బాగుండునని అనుకుంటాడు. ఒకవేళ అదే వస్తే అక్కడా సంతృప్తిపడేదిలేదు. ఆ తరువాత ఇంకా ఎక్కువ జీతం హోదా కావాలని... అలా అంతంలేని కోరికలు అతనిని ఉయ్యాలూగిస్తుంటాయి.

ఎంతవరకు తృప్తి తినడానికి తిండి, వుండడానికి ఇల్లు, కట్టుకోవడానికి బట్ట వుంటేచాలు. కాని ఆశలపల్లకీలో దొర్లుతున్న వారికి తనపై వారిని చూచిపోటీ పెట్టుకోవటమే తెలుస్తుంది. కాని, తన కన్న తక్కువస్థితిలో వున్నవారిని చూచి అతనికన్న మనం బాగున్నాము చాలు అని తృప్తి పడకపోవటమే అతనికి అశని పాతం. అదే అతని జీవితంలో శాంతిని దూరంచేస్తుంది. అశాంతి తాండవిస్తుంది. ఈ రకమైన మానసిక వైకల్యం పెరిగితే అది అతనిచేత నేరాలుచేయిస్తుంది. అప్పుడు కష్ట - నష్టాల కల్లోలాలు జీవితంలోకి ఒరిగిపోగా అలవాటుపడటం తప్ప చేసేదేమీ వుండదు సుమా!

జీవితాంతం ప్రశాంతంగా సాగిపోవాలని కోరుకుంటారు. కానీ, అందుకు కావలసిన జీవన విధానం వుండదు. **"స్వీయసౌఖ్యములకు వెంపరలాడుచు, క్రూరమృగ పరుల కొల్లగొట్టు, మానవుండు ముందు మార్గమ్ముగనడు"** అన్నారు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారు. మనస్సును అదుపులో వుంచుకోవాలి. మనస్సులో మెదిలే ప్రతి కోర్కెను కార్యరూపం ధరింపజేయరాదు. కోర్కెలను నిగ్రహించాలి. తన విధ్యుక్తధర్మాన్ని నిర్వహిస్తూ లభించిన దానితో తృప్తిపడాలి. పరులహితం కోరుతూ నిబద్ధతతో జీవించాలి. పదుగురు మెచ్చేది తన జీవితాన్ని సఫలీకృతం చేసేదీ అదే! ప్రశాంత జీవితం ఇహాన్నే కాకుండా పరాన్ని అందిస్తుంది. నిర్మలము ప్రశాంతము అయిన రాచబాటది. ప్రశాంత జీవనానికి కావలసిన బాటలను మారకుండా చూచుకోండి! ఆనందడోలికలతో సాగిపోండి.

సర్వేజనాస్సుఖినోభవంతు

జ్ఞాన సుధ

# నీటి బుడగ

సహజ కవి వి. శ్రీరామరెడ్డి

కంస నిర్యాణానంతరం శ్రీకృష్ణుడు తాతగారైన ఉగ్రసేనుని సింహాసనంపై కూర్చోబెట్టి తాను కిరీటం లేకుండా మధురానగరాన్ని పరిపాలిస్తున్న కాలంలో ఒక బ్రాహ్మణుని భార్య ప్రసవిస్తే ఆ బిడ్డ పుట్టీపుట్టగనే చనిపోయాడు. ఆ బ్రాహ్మణుడు పుత్ర శోకంతో అలమటిస్తూ మృతశిశువునెత్తుకొని రాజమందిరం వద్దకు వచ్చి చనిపోయిన కుమారుని ద్వారం వద్దదించి, విధిని నిందిస్తూ తన్నుతాను తిట్టుకొంటూ గుండెబద్దలయ్యేటట్లు దుఃఖింపసాగాడు. అయ్యలారా, చూశారా! ఈ మహారాజు రాజ్యంలో నాబిడ్డ పుట్టీపుట్టకమునుపే చనిపోయాడు. ఈ భూపాలుడు చేసిన అధర్మాలు అన్యాయాలవల్లనే ఇలా జరిగినది, కాకపోతే ఎప్పుడైనా శిశుమరణాలు చూశామా ? ఇందుకు రాజే కారణమంటారా లేదా ? అయ్యో నాకన్న తండ్రికి అపుడే నూరేళ్ళు నిండాయే అని గుండెలు బాదుకొంటూ, ఆ మృతశిశువునెత్తుకొని వెళ్ళిపోయాడు.

తర్వాత కొన్నాళ్ళకు ఆ బ్రాహ్మణుని భార్యకు గర్భం రావడం నెలలు నిండి ప్రసవించడం, ఆ బిడ్డకూడావిగతజీవుడు కావడం, బ్రాహ్మణుడా మృతశిశువును నెత్తుకొనిరావడం రాజభవనం ముందునుంచోని రోధించడం, యప్పటియట్ల వెళ్ళిపోవడం జరుగుచుండెడిది. ఈ విధంబున ఎనమండుగురు సుతులు మృతులైన పిదప తొమ్మిదవ బిడ్డకూడా విగతజీవుండైన వానినెత్తుకొనివచ్చి యెప్పటి యట్లపలవరించుచున్న యాబ్రాహ్మణుని ఆ సమయానికి అక్కడేవున్న అర్జునుడు చూచి ఇలా అన్నాడు. అయ్యా! నీకు ఇంతమంది పుత్రులు అన్నెము పుణ్యము ఎరుగక పుట్టీపుట్టక మునుపే చనిపోతుంటే ఈ అన్యాయాన్ని చూస్తు వారించేవారు ఒక్కరైనా ఈ పట్టణంలో లేరా ? ఇది మాత్రం సహించరాని నేరం, ఒకరా, ఇద్దరా, తొమ్మిది మంది కుమారులను పోగొట్టుకున్న నీ బాధ నేను అర్థము చేసుకోగలను. అదియుంగాక కన్నబిడ్డల్ని పోగొట్టుకొని పుత్రశోకంతో పరితపించే బ్రాహ్మణులు ఎవనిరాజ్యంలో ఉందురో ఆ రాజు కేవలం నామమాత్రపు రాజేగానీ మరియొకండుగాదు. బ్రాహ్మణోత్తమా! ఇకపై పుట్టబోయే నీ సంతానాన్ని నేను బ్రతికిస్తాను. నా మాట నిలుపుకోకపోతే నేను అగ్నిప్రవేశం చేస్తాను ఈ విధంగా అర్జునుడు అందరూ ఆశ్చర్యపడేలా అన్నాడు. ఆ మాటలువిన్న బ్రాహ్మణుడు అయ్యా ఇలాంటి అనుచితపు మాటలు మీరు పలుకడం దేనికి, పరాక్రమశాలులు బలవంతులు అయిన బలరామకృష్ణులున్నారు, ప్రద్యుమ్నాదులున్నారు. పేరుగాంచిన యాదవవీరులున్నారు. వారిచేత కాని పనిని మీ చేత నవుననడం హాస్యాస్పదం. అయినా నీకు ఎలా సాధ్యం. కాన నీ దారిన నీవు వెళ్ళవచ్చు అన్నాడు బ్రాహ్మణుడు.

బ్రాహ్మణుని మాటకు అర్జునుని మనస్సు

చివుక్కుమనగా, అక్కడున్న జనాలు వినేటట్లు రోషంతో ఇలా అన్నాడు. బ్రాహ్మణోత్తమా! నేను బలరాముడిలాంటి వాడనను కున్నావా, కృష్ణుడు లాంటివాడ ననుకున్నావా, వారి కుమారునిలాంటి వాడి ననుకున్నావా, ఏమనుకున్నావు, వారిలో నేనెవరిలాంటివాడను కాను. యుద్ధంలో గాండీవం ధరించి నారిసారించి విడిచే వాడి బాణాల సమూహంతో శత్రవులను చించిచెండాడే మహాపరాక్రమవంతుని పాండురాజుసుతుని పార్థుని, అదియుంగాక ఆ పరమేశ్వరున్నే నా భుజబలంతో ఎదిరించి పోరాడిన నన్నూ నా సామర్థ్యము ఎరుగక మాట్లాడితివి. మృత్యుదేవత పొగరణచి నా భుజబలాన్ని పంతాన్ని చూపించి నీ బిడ్డలను ఇప్పుడేతెచ్చి ఇవ్వమంటావా ? అని అర్జునుడు ఈ విధంగా నమ్మబలికాడు. అప్పుడు బ్రాహ్మణునికి పార్థునిపై నమ్మకం కలిగినది. నెమ్మదిపడిన మనస్సుతో అర్జునుని కొనియాడుతూ ఇంటికి వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళు గడిచిపోయినది. బ్రాహ్మణుని భార్యకు మళ్లీ గర్భం వచ్చి ప్రసవవేదన ప్రారంభమయినది. భూసురోత్తముడు ఆత్రంతో వచ్చి అర్జునునికి వార్త తెలిపాడు. విషయం విన్న పార్థుడు తక్షణం మనస్సులో శివుని తలచుకొని గాండీవం ధరించి అమ్ముల పొదలు ఇరువైపుల వీపున కట్టుకొని బ్రాహ్మణుని వెంట ప్రసవ మందిరానికివెళ్లి, ఆ గృహాన్నంతటినీ దట్టమైన బాణాలతో కప్పివేశాడు. మిక్కిలి జాగ్రత్తగా ఆ ప్రసూతి గృహాన్ని కావలి కాస్తున్నాడు. కాలు ఒకచోట నిలువనీక నలువైపుల చూస్తూ హుషారుగా తిరుగుతున్నాడు. ఆ సమయంలో బ్రాహ్మణుని భార్యకు మగబిడ్డ పుట్టాడన్నారు. భూసురుని ఆనందానికి అవధుల్లేక పోయింది. అంతలోనే పురిటిబిడ్డ శరీరంతో ఆకాశానికి అదృశ్యమైపోయాడు అక్కడున్నవారంతా పోయాడు పోయాడని ఆర్తనాదాలు చేశారు. బ్రాహ్మణుడు పుట్టెడు దుఃఖంతో కుమిలిపోయాడు.

చూశారా అర్జునుడంతటి మహావీరుడు అస్త్రశస్త్రాలతో కావలి గాచాడు. బ్రాహ్మణుని కుమారుని బ్రతికించెదనని ప్రతిజ్ఞజేసి తన మాట నిలుపుకొనుటకు ఎంతో కట్టుదిట్టమైన ఏర్పాటు గావించియు, రెప్పపాటులో మాయమైపోయిన ఆ ప్రాణరహస్యాన్ని కనిపెట్టలేకపోయాడు. అనగా ఆయువు తీరిపోవునాడు ఎంతటి వారికైనా మృత్యువును ఆపడానికి సాధ్యం కాదని తెలియాలి.

**"కోటి వైద్యులు గుంపుగూడివచ్చిన గాని**
**మరణమనియెడి వ్యాధి మాన్పలేరు"**

కోటి మంది వైద్యులు పరీక్షించి ఔషధాన్నిచ్చినను మరణమనే వ్యాధి మాన్పలేరని శాస్త్రం చెబుతున్నది. "నమ్మరాదయ్య ఇది మాయ నాటకంబు" అని పెద్దలు చెబుతున్నారు. ఈ మాయనాటకంలో మనపాత్ర ఎంతని తెలవలసి వుంది.

1 నమ్మబోకు నమ్మబోకు నమ్మబోకుడయ్యా దీన్ని నమ్మబోకుడయ్యా
మాయజీవము మట్టిదేహము బొట్టుకు కొరగానిదయ్య ॥ రాగి॥
నిజము నీవే తెలియుడయ్య ఎందుకింత మోహమయ్య ॥ నమ్మ॥

2 గాలిలోని దీపమయ్య క్షణము నారిపోవునయ్య
ఎప్పుడో ఏవేళనో మరి ఎరుగ రానిది తిరుగులేనిది
నిజము నీవే తెలియుడయ్య ఎందుకింత మోహమయ్య ॥ నమ్మ॥

3 మూడునాళ్ళ ముచ్చటయ్య మురిసిపోదు వేళనయ్య
వట్టిభ్రాంతి మట్టిబొమ్మశాశ్వతంబిదికాదు కాదు
నిజము నీవే తెలియుడయ్య ఎందుకింత మోహమయ్య ॥ నమ్మ॥

4 నీటిమీద బుడగ నిజము నిమిషమెగిరి పోవునయ్య
గుట్టుతెలియక పట్టబోతె పట్టుదప్పి పారిపోవు

నిజము నీవే తెలియుడయ్యా ఎందుకింత మోహమయ్యా ॥ నమ్మ॥

5 తల్లిదండ్రి సతులు సుతులు బంధములని తెలియవలయు
బాటసారి నీకు నేల భ్రమలు వీరిపైన చాలా ॥ ఓ
నిజము నీవే తెలియుడయ్యా ఎందుకింత మోహమయ్యా ॥ నమ్మ॥

6 ఇల్లువాకిలనుచు నీవు తల్లడిల్లిపోదు వేళ
ఉల్లమందున నొక్కసారి ఉనికి తెలుసు కొనుము చాలు ॥నీ
నిజము నీవే తెలియుడయ్యా ఎందుకింత మోహమయ్యా ॥ నమ్మ॥

7 అద్దెకొంప పైన నీకు ఆశయింత ఏలనయ్యా
వద్దువద్దని ఎంత చెప్పిన బుద్ధులినవది ఏమయా॥ నా
నిజము నీవే తెలియుడయ్యా ఎందుకింత మోహమయ్యా ॥ నమ్మ॥

8 మోహ పాశమవని లోన మొదలు నరికి వేయవలయు
ఉన్న సత్యమిదేనని ఊరువాడ తెలియవలయు
నిజము నీవే తెలియుడయ్యా ఎందుకింత మోహమయ్యా ॥ నమ్మ॥

9 చిన్నపిల్లవోలె నీకు చెప్పిచెప్పి విసిగిపోతి
"న్నులిచ్చి నందుకైన నుడి సత్యము వేగవేగ ॥ నీకు
నిజము నీవే తెలియుడయ్యా ఎందుకింత మోహమయ్యా ॥ నమ్మ॥

10 బ్రహ్మసత్యం జగంమిథ్య తెలుసుకుంటే తేటతెల్లం
తెలియకుంటే నీకె నష్టం
బ్రహ్మమెరిగిన జ్ఞానులంతా బాగు బాగని బోధజేసిరి
ముముక్షువులై ముక్తి బొందిరి ॥ వారు
నిజము నీవే తెలియుడయ్యా ఎందుకింత మోహమయ్యా ॥ నమ్మ॥

11 ఋషులు చెప్పిన వేద సత్యం మళ్ళీమళ్ళీ విన్నవారికి
మోహముడుగును మోక్షమబ్బును
రాదురాదయ మళ్ళీ జన్మం రాబోదయ నీచజన్మం
ముమ్మాటికి ముక్తి ఖాయం ॥ నీకు
నిజము నీవే తెలియుడయ్యా ఎందుకింత మోహమయ్యా ॥ నమ్మ॥

12 ఆత్మతత్వము తెలుసుకొంటె ఆరిపోవును మోహము
అది పారిపోవును మోహము
నిన్ను నీవే తెలుసుకుంటే నీవె దేవుడవందురు
దేవుడన్న జీవుడన్న వేరుకాదని తెలియుడన్న
నిజము నీవే తెలియుడయ్యా ఎందుకింత మోహమయ్యా ॥ నమ్మ॥

13 కల్లకానిది గురుని సాక్షిగ యెల్లరినవలె నిత్యము
యిది యెల్లరినవలె నిత్యము
వాసిగ శ్రీరామరెడ్డి వ్రాసిచెప్పిన సత్యము
యిది చాటి చెప్పిన సత్యము
నిజము నీవే తెలియుడయ్యా ఎందుకింత మోహమయ్యా ॥ నమ్మ॥

మాయమోహములతో కల్పితమైనది ఈ జగం. కనిపించే దంతా మాయ. గారడివాని మాయలోబడి నీ స్థాయిని మరచి, ఆశామోహములకు లోనై దారితప్పి చరించావో నీగతి అధోగతే. "నీటిమీది బుగ్గ నిలువ దరనిమిషమని" హెచ్చరిస్తున్నాయి శాస్త్రాలు. ఇటువంటి అశాశ్వతమైన ఈ దేహాన్ని నమ్ముకొని, ధనధాన్యములు మెండుగా సంపాదించి, దానధర్మములు లేక జీవితాన్ని గడిపితివో కాలం తీరిపోవునాడు ఒక్కకానీకూడా ఎత్తుకొని పోలేవు. శ్మశానంలో ఒంటిపై బట్టలేకుండా కాల్చేస్తారు. కాబట్టి ఉన్ననాలుగు రోజులు మంచిగా బ్రదికి దానధర్మములు చేస్తు నిత్యమూ పరమాత్ముని సేవలో కాలం గడపాలి. మోక్షకామికి అదే మార్గము. మానవ జీవిత లక్ష్యముకూడా అదియే. 

. దీపం క్రింద నీడ వుంటుంది. చిరునవ్వుతో సాగిపోయే నీ జీవితములో కన్నీటి కష్టాలుకూడా ఉంటాయి. అయితే దీపకాంతిలో నీడను వదిలి వెలుగును తీసుకున్నట్లే నీ జీవితంలో కూడా కష్టాలను లెక్కచేయక వెలుగులా సాగిపో..



# పేద విద్యార్థులకు ఉచిత విద్య



శ్రీ అచలానంద ఆశ్రమము ఛారిటబుల్ ట్రస్ట్, ఒంగోలు వారి ద్వారా పేద విద్యార్థులకు గత 10 సంవత్సరాలుగా ఉచిత విద్య అందించబడుచున్న విషయం అందరికి తెలిసిన విదితమే.

జ్ఞానదానం, అన్నదానం, విద్యాదానం, వైద్యదానం అనేవి పూజ్యపాద శ్రీశ్రీశ్రీ 'యోగి' అచలానందస్వామి వారి సంకల్పం. అందులో భాగంగానే ప్రస్తుతం ఒంగోలులోను, తోట్లపల్లి గ్రామము శ్రీ బ్రహ్మంగారి మఠం మండలంలోను శ్రీ అచలానంద ఆశ్రమము ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అన్నదానము, విద్యాదానము జరుగుచున్నవి. జ్ఞానదానం అనేది ఆశ్రమ ప్రచురణల ద్వారా, సత్సంగముల ద్వారానూ, ధ్యాన యోగాభ్యాసం ద్వారాను జరుగుచున్నది. వైద్యదానం ప్రస్తుతం పేద వృద్ధులకు నేత్ర వైద్యం, మందులను ఇప్పించుట ద్వారా పాక్షికంగా జరుగుచున్నది. పై కార్యక్రమములన్ని దాతల సహకారంతో జరుగుచున్నవి. ప్రస్తుతం ఆశ్రమములో 20 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ సంవత్సరము మరికొంత మంది విద్యార్థులను స్వీకరించదలచి ఆహ్వానిస్తున్నాము.

తేది 28-4-2015 న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆరాధన పర్వదినం రోజున ఈ పరీక్షకు హాజరుకాదలచిన విద్యార్థులు ముందుగా ఆశ్రమములో మీ పేరును నమోదు చేసుకోవాలి.

6,7,8 తరగతి చదువ వలసిన పేద విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఒంగోలు, శ్రీ అచలానంద ఆశ్రమమునందు ఈ పరీక్షలు నిర్వహించబడును. పరీక్షకు హాజరు కాగోరిన విద్యార్థులు ప్రొగ్రెస్ రిపొర్టు లేదా మార్క్స్ మెమో తీసికొని తేది 25-4-2015 శనివారం ఒంగోలు ఆశ్రమమునకు చేరుకొనగలరు. కుల, మత, ప్రాంత భేదాలులేకుండా ఈ పరీక్ష నిర్వహించబడును

## శ్రీ అచలానంద ఆశ్రమము ఛారిటబుల్ ట్రస్ట్

**శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,**
**ఒంగోలు - 523 002 ప్రకాశం జిల్లా, (ఆం.ప్ర)**
**ఫోన్స్: 9949132469, 9703587035, 8977799289**

# వేద పరిచయము

## ఋగ్వేద పరిచయము

.......... ఆచార్యడా॥ మట్టి కృష్ణారెడ్డి ............

**నాల్గవ మండలం**

నాలుగవ మండలంలో 58 సూక్తాలు, 589 మంత్రములు ఉన్నవి. ఇది ఆర్షవిజ్ఞానం అందించే మంత్రాలతో నిండి మహిమాన్వితమైయున్నది. ఈశ్వరుని నిశ్వాసరూపాలైన వేదాలు, అమృత గంగలా విజ్ఞానంతో నిండి ఈ లోకాన్ని చేరుకొన్నాయి. ఈ జ్ఞానవాహిని జవనాశ్వంలా వేగంగా సాగుతూ లోకాన్ని ముంచెత్తుతోంది. మనం అజ్ఞానాన్ని తొలగించుకుంటే ఈశ్వరానుగ్రహం వేదాలలో ఉన్న జ్ఞానం గోచరమవుతుంది. వేటగాడి క్రౌర్యానికి భయపడ్డ మృగంలా వేగంగా జ్ఞానం భగవదాశ్రితులను చేరుతుంది. ఈ జ్ఞానం ఒక అంశ ఇంద్రశక్తితో, రెండో అంశ సూర్యుని శక్తితో, మరో అంశ ఋషుల తపశ్శక్తితో గ్రహింపబడుతున్నది. భార్య ప్రీతితో భర్తను చేరునట్లు జ్ఞానంతో కూడిన వేదాలపై అమితమైన ఆదరం గల పరమాత్మను పొందవచ్చని ఈ మండలం తెలుపుతున్నది.

రౌతు గుఱ్ఱాల గుంపులో, తన కాయానికి అనువైన వైశాల్యంగల వెన్నుతో అంటే అశ్వాన్ని ఎన్నిక చేసుకుంటాడు. అలాగే కమ్మరివాడు ఖనిజాన్ని కరిగించి శుభ్రం చేసినట్లు మనస్సును పవిత్రం చేసుకుని వైదిక విజ్ఞానానికి హృదయాన్ని అనుగుణంగా తీర్చిదిద్దుకోవాలి. దాదాపు ఈ మండలంలోని మంత్రాలన్నింటిని దర్శించిన మహర్షి వామదేవుడు.

**ఐదవ మండలం**

ఈ మండవములో 87 సూక్తాలు, 727 మంత్రములు ఉన్నవి. భగవంతుని ఆశ్రయించిన వారికి వేదాలు కరతలామలకాలు అవుతాయి. భగవత్ప్రియుడు వేదాలకు ప్రియాతి ప్రియుడు. పరమాత్మను నమ్ముకున్నవానిని ఋక్కులు ఆదరిస్తాయి. సర్వాంతర్యామిని నిరంతరం స్మరించే వానిని సామలు గౌరవిస్తాయి. అగ్ని పరమాత్మను గుర్తించాడు కనుక వేదాలు అతనిని ఇష్టపడతాయి. ముఖ్యంగా సామలు ప్రేమించాయి. అగ్నికి భగవంతుడు సన్నిహితుడయ్యాడు. కాబట్టి వేదాలు భగవదభిన్నములని సుస్పష్టమవుతున్నది.

**ఆరవ మండలం**

ఈ మండలములో 75 సూక్తాలు, 765 మంత్రములు ఉన్నవి. సర్వజ్ఞుడైన పరమాత్మను స్తుతించాలని, సత్కార్యాలతో సాటివారిని గౌరవించాలని, హింసా ప్రవృత్తిని విడనాడి కేవలం భగవద్గుణానుభవంతో జీవించాలని ప్రబోధిస్తున్నది. వాచామగోచరుడైన పరమాత్మను దర్శించడానికి చెవులు, నేత్రాలు, మనస్సు, సామర్థ్యం లేనివని తెలుసుకోవాలని ఉపదేశిస్తూ భగవదనుభవాన్ని సమున్నతంగా తెలియజేస్తున్నది. దేవదేవుని దివ్యగుణాలను వినాలని, ఉచ్చరించాలని, పరమాత్మనే ఆశ్రయణీయమని తెలియజేసి, పరమాత్మ సాక్షాత్కారం వల్ల కలిగే ఆనందాతిశయాన్ని వ్యక్తం చేస్తున్నది.

**ఏడవ మండలం**

ఈ మండలములో 104 సూక్తాలు, 842

మంత్రములు ఉన్నవి. ఓ పరమాత్మా! నీ మహిమజ్ఞానం కొంతైనా కలిగి నీ స్తుతితో తరించే సామర్థ్యాన్ని కలిగించమని కోరుకోవడం ఇందులో ముఖ్యమైన విషయం. లౌకికమైన ఋణాదిబాధలను తీర్చి సంపదలను ప్రసాదించుమని విరాట్ స్వరూపుడైన పరమాత్మను ప్రార్థించాలి. విష్ణువు యజ్ఞము యొక్క విశ్వరూపం అమేయమైనది. వషట్కారంతో ఆహ్వానిస్తూ, నీ ప్రార్థన చేస్తున్న మమ్ము మన్నించి మా మాటలు స్తుతిగా అనుగ్రహించుము. 'శాశ్వతమైన కటాక్షం మాకు ప్రసాదించుము' అని విష్ణువును సేవిస్తే వివిధ సంపదలు, జ్ఞానం, స్వార్థరాహిత్యం, ప్రజలకు సేవచేసే శక్తి కూడా లభిస్తాయిని ఈ మండలం ద్వారా సుస్పష్టమవుతున్నది.

**ఎనిమిదవ మండలం**

ఇందులో82సూక్తాలు, 1632 మంత్రములు ఉన్నవి. వివేకవంతులు అజ్ఞానానికి, అజ్ఞానాంధకారంలో ఉన్నవారికి దూరంగా ఉండాలన్న సంకల్పం, భగవదనుగ్రహానికి అర్రులు చాచడం ఈ మండంలో ప్రధానంగా కనిపించే అంశాలు. భగవంతుని స్వరూపం ప్రపంచమంతా ఆవరించి ఉన్నది. కళ్ళు తెరచి చూస్తే విశ్వంలోని సకల పదార్థాలలో పరమాత్మ ఉన్నాడు. సత్యదర్శనం చేసేవారు ఆ పరమాత్మ స్వరూపమును కీర్తిస్తారు. వారి జ్ఞానానికి మూలకారణం పరమాత్మయే అని ఈ మండలం వివరిస్తుంది.

**తొమ్మిదవ మండలం**

ఇందులో 114 సూక్తాలు, 1108 మంత్రములు ఉన్నవి. ఇది అత్యంత విలక్షణమైనది. ఈ మండలంలోని కొన్ని సూక్తాలు పవమాన సోమదేవతను సంబోధిస్తూ ప్రత్యేకరీతిలో కీర్తించబడ్డాయి. అందువల్ల దీనిని కొందరు పవమానమండలమని వ్యవహరిస్తుంటారు. కానీ రెండు నుండి ఏడువరకు గల ఋషిమండలాలకు వరుసగా ద్రష్టలైన గృత్సమదుడు మొదలైన ఋషులే ఈ సూక్తాలకు కూడా మూలకారకులు. దీన్ని బట్టి చూస్తే ఋషిమండలాల్లోని పవమానసోముని సంబోధించే సూక్తాలు ఈ మండలంలో పొందుపర్చబడ్డాయని కొందరు విజ్ఞులు అభిప్రాయయపడుతున్నారు. ఈ మండలంలోని సూక్తాలు ఛందోఽనుసారం అమర్చబడినాయి. 1 నుండి 67 వరకు గాయత్రి, 68 నుండి 97 వరకు త్రిష్టుప్, 98 నుండి 114 వరకు అనేక వృత్తాలలో ఉన్న సూక్తాలను మనం దర్శించవచ్చు.

పవిత్ర స్వరూపుడై, సమస్త ప్రాణుల ఉత్పత్తికి హేతువై, ఈ జగత్తుకు అధిపతిగా ఉన్న పరమాత్మను పవమాన సోముడుగా కీర్తించడం ఈ మండలంలో ప్రత్యేకమైన అంశం. జీవులకు శరీరాన్ని, పృథివినీ సృజించి ఐహిక, ఆముష్మిక సంపదలనిచ్చి లేగదూడపై గోమాతలా వాత్సల్యాన్ని వర్షించే పరమాత్మను వర్ణించింది. తనను ఆశ్రయించే భక్తుల వద్దకు ఎప్పుడూ చంటి బిడ్డ తల్లి ఒడికి వెళ్ళేటట్లు, పెండ్లికూతురు వరుని వద్దకు వెళ్ళునట్లు ప్రేమగా వచ్చే సోముని వాత్సల్యాన్ని కీర్తించడం జరిగింది. ప్రతి పవిత్రహృదయం పవమానసోముని చక్కని నిలయంగా ఈ మండలం పరిపూర్ణంగా ప్రబోధించింది. అందువల్ల ఈ మండలాన్ని పవమానమండలమని వ్యవహరిస్తున్నారు.

**పదవ మండలం**

ఇందులో 191 సూక్తాలు, 1754 మంత్రములు ఉన్నవి. విశ్వమానవ సౌహార్ద్రాన్ని, సామాజిక చింతనను విశ్లేషించిన దశమమండలం ఋగ్వేదమండలాలలోనే

శిరోమణి వంటిది. అజ్ఞానమనే మంచుపొరను చీల్చుకొని విజ్ఞాన సూర్యకిరణాలు ప్రసరిస్తేనే పరమాత్మను దర్శించడం సాధ్యం అవుతుంది. ఈ మండలం జూదం పట్ల ఆసక్తులైన వారి మనస్సులోని దౌర్బల్యాన్ని సమగ్రంగా ఆవిష్కరించింది. జూదం వల్ల సర్వస్వం కోల్పోయి తల్లికి, ఇల్లాలికి తీరని దుఃఖాన్ని చేకూర్చుతారు వారు. అందువల్ల జూదాన్ని విడనాడి వ్యవసాయాన్ని ఆశ్రయించి శ్రమకు తగినట్లుగా ధాన్యాదిరూపమైన సంపదను పొందుమని బోధించింది. మేఘాలు తియ్యని నీటిని ఇస్తున్నట్లు, తేనెటీగలు మధువును ఇస్తున్నట్లు, పశువులు కమ్మని పాలను ఇస్తున్నట్లు, కష్టజీవులు సంపదను కలిగి ఉంటారని చెబుతూ ధర్మమార్గాన్ని ప్రబోధించింది. బావనా సమైక్యతకు నాందిపలికింది. స్నేహం, సౌహార్థం వంటి కళ్యాణభావనలు కలిగి ఉంటే భగవదనుగ్రహం సిద్ధిస్తుందని వివరించింది. ఈ మండలంలోని సూక్తాల సంఖ్య తప్ప ఏ నియమం ప్రత్యేకంగా కనబడదు. ఇందులో 191 సూక్తాలలో 1 నుంచి 84 వరకు గల సూక్తాలు కొన్ని సముదాయాలుగా విభజింపబడ్డాయి. ఈ సూక్త సముదాయాలలో ముందుదానికన్న తరువాత సూక్త సముదాయం తక్కువ సూక్తాలు కలదిగా కనబడుతున్నది. 85 నుంచి 191 వరకు గల సూక్తాలు విడిసూక్తాలే. వీటిలో కూడా ముందు సూక్తం కన్న తరువాతి సూక్తంలో మంత్రాల సంఖ్య తగ్గుతూ ఉంటుంది. మొదటి మండలంలోను 10వ మండలంలోను సూక్త సంఖ్య ఒక విధంగా ఉండడం కూడా ఒక ప్రత్యేక అంశంగా గమనించవచ్చును.

జ్ఞానకాండయైన ఈ విశాల ఋగ్వేదంలోని 10 మండలంలో అత్యద్భుతంగా వివిధ పదార్థాల గునగణాలు వర్ణించబడ్డాయి. నాసదీయసూక్తంలో సృష్టివిజ్ఞానం, పురుషసూక్తంలో సామాజిక విజ్ఞానం, హిరణ్యగర్భసూక్తంలో పరమేశ్వర విజ్ఞానం ద్యూతనివారణసూక్తంలో సమాజరీతినీతులు వర్ణించబడ్డాయి. స్వస్తివాచకాలు, స్త్రీ ప్రశంసాసూక్తాలు, యమయమీసూక్తం, కథాసూక్తాలు మొదలగునవి ఎన్నో ఉన్నాయి.

సృష్టిక్రమం, పూర్వజన్మ, మరణానంతరం జీవుడు పరమేశ్వరోపాసన, కైవల్యం మొదలైన తాత్త్విక విషయాలను, అనేక ఐహిక విషయాలను కూడ చక్కగా వివరించిన ఋక్కులెన్నో ఋగ్వేదంలో ఉన్నాయి.

ఇక శాంతికాముకతను, ఐకమత్యాన్ని సౌఖ్యాన్ని ప్రసాదించే చిట్టచివరి సూక్తంలోని దివ్యజ్యోతిని తెలుసుకుందాం.

**"సమానీవ ఆకూతిః సమానా హృదయాని వః**
**సమానమస్తు వో మనో యథావః సుసహాసతి"**

ఆర్యులారా! "ఎట్లు మీ అందరకును శుభప్రదమైన కూడిక సంభవించునో, అట్లే మీ సంకల్పములు కూడ ఏకమగునుగాక! మీ హృదయములు ఏకమగునుగాక! మీ అంతఃకరణములు ఏకమగునుగాక! ఇది ఎంత చక్కని మంగళాంతం!

- గొల్లవాడు మేకపిల్లను చంకలో పెట్టుకొని భ్రమపడి దాని కొరకై మందలో వెదుకు తున్నట్లు మానవుడు తనలోనున్న దైవమును గుర్తించక పరదైవముల కొరకై పరుగిడుచున్నాడు.
- తిరగలి రాళ్ల మధ్యనలుగుతున్న ధాన్యపుగింజల మాదిరి సుఖదుఃఖాలనే ఈ తిరగలిరాళ్ల మధ్య చిక్కుకొని పరితపిస్తున్న మానవుని రక్షించగలిగిన వాడు సద్గురువు మాత్రమే

# ఆది గురువు ఆచార్య శంకరులు

- శ్రీమతి జానమద్ది స్వర్ణలతా జోషి

**పూజ్యాయ శంకరార్యాయ తత్వ నిష్ఠాయ యోగినే।**
**భజతాం జ్ఞాన దాత్రేచ నమతాం ముక్తి హేతవే॥**

'ఈశానః సర్వవిద్యానామ్' అని శ్రుతులలో చెప్పబడిన, స్తుతింపబడిన శంకరులు చంద్రశేఖరుడని, చంద్రమౌళి అని పురాణాలలో వర్ణింపబడ్డాడు. ఆ మహాదేవుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తి సమన్వితుడు. అంతేకాదు, సర్వవిదుడు, సర్వేశ్వరుడు. నారాయణ బ్రహ్మ, రుద్రులనే త్రిమూర్తులు ఆయన అంశలే. గురు పరంపరకు పునాదియైన ఆధ్యాత్మ విద్యకూడా ఆ మహాదేవుని లీలయే. ఉమామహేశ్వరుడని చెప్పబడిన అతడే గురువు మరియు దక్షిణమూర్తిగా చెప్పబడ్డాడు. ఆయన అర్థాంగియే చిచ్ఛక్తి. లౌకిక ప్రపంచం దృష్టిలో కూడా 'ఉమ' ఆమెయే. ఆమెయే దేవేంద్రునికి బ్రహ్మోపదేశం చేసిందని కూడా 'కేనోపనిషత్తు'లో చెప్పబడింది. జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయలలోని 'స్థితి' కాలంలో ప్రజలలోని అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞాన దాసోహం చేయాలన్నదే ముఖ్య ఉద్దేశ్యం. అందులోనూ లౌకిక వస్తువుల, అనాత్మ వస్తువుల పట్లగల అజ్ఞానాన్ని మోహాన్ని తొలగించి, జ్ఞానమును ప్రబోధించాలని, ఆత్మస్వరూపమును గురించిన అవిద్యను తొలగించి బ్రహ్మవిద్యను అనుగ్రహించటానికి 'సద్గురువు' ఒక్కడే సమర్థుడు. అలాంటి సద్గురువుకు అవసరమైన యోగ్యతలు ఇచ్చి అష్టమూర్తి రూపం ధరించి, జగత్తును కాపాడేపరమేశ్వరుడే యోగ్యుడు. అతనికి సాటి ఎవరూలేరు. అందుకే గీతలో అర్జునుడు 'త్వమస్య పూజ్యశ్చ గురుర్గారీయన్' అని భగవంతుని నుతించాడు. అలా పరమేశ్వరుడు తన అవతారలీలలో ఒకసారి బాలకుడై దక్షిణాభిముఖుడై, వటవృక్షం క్రింద యోగాసనంలో, చిన్ముద్రలో ఆసీనుడై ఋషి - మునులకు జీవబ్రహ్మల ఐకతత్వాన్ని ఉపదేశించాడు. కాని కాలక్రమంలో కేవలం భౌతిక దృష్టి, బాహ్యదృష్టి ప్రదానులైన లౌకిక జనులు సంప్రదాయ, ఆగమశాస్త్ర జ్ఞానము లోపించడం వలన తమ బుద్ధికి తోచిన విచారములనే శాస్త్రములు అను పేరుతో రచించారు. అలా బ్రహ్మవిద్య కాస్త కనుమరుగైంది. లౌకిక జనుల స్వభావం ఎలాంటిదంటే వారికి 'క్రొత్తొక వింత పాతొక రోత'. గుణదోష విచారణ చేసి సత్యాన్ని బహిర్గతం చేసే ఏకాగ్రత వారికి లేకపోయింది. అప్పటి రాజకీయ పరిస్థితులు కూడా అలాగే వుండేవి. అలాంటి విచిత్ర సిద్ధాంతములకు అప్పటి రాజుల ఆశ్రయము కూడా దొరికిందంటే అందులో ఆశ్చర్యమేమీ లేదు. అలాంటి వాతావరణంలో సత్యం తాత్కాలికంగా మరుగున పడుతుంది. ఆచార్య శంకరులు జన్మించినప్పుడు భారతదేశంలో అలాంటి పరిస్థితులే వుండేవి.

అలాంటి విపత్కర పరిస్థితులలోనే 'సంభవామి యుగే యుగే' అన్నట్లుగా నిత్య సత్య స్వరూపుడైన పరమేశ్వరుడు సత్యధర్మముల రక్షణ కోసం సంకల్పిస్తాడు. దానికి తోడుగా ఋషులు, మునులు కూడా ఆ భగవంతుని ప్రార్థిస్తారు. అలా వారు సనాతన ధర్మం యొక్క రెండుశాఖలైన కర్మకాండ - జ్ఞానకాండల అనుష్ఠానం కనుమరుగైందని, అందువలన దురాచారము పెరిగిపోతున్నాయని

శంకరుని సన్నిధిలో విన్నవించుకున్నారు. వెంటనే ఆ మహాదేవుడు తన కుమారుడైన కుమారస్వామిని చూడగా అతడు వెంటనే లేచి నిలబడ్డాడు. శివుడు అతనితో 'వత్సా! నీవు ఇప్పుడు భూలోకంలో శ్రోత్రియుడు, అకామహతుడు అయిన బ్రాహ్మణుడిగా అవతరించి, వేదాల పూర్వభాగమైన కర్మకాండను పునరుద్ధరించు. అవసరమైనచో 'శరీర దండనం' కూడా అనుసరించి వేద ప్రమాణాలను స్థాపించు. వైదిక ధర్మాన్ని సంస్థాపనం చేయి. దీని ద్వారా ప్రజలు నిన్ను 'సుబ్రహ్మణ్యుడు' అని ప్రశంసిస్తారు. కుమారస్వామి కార్యోన్ముఖుడయ్యాడు. అతడు మహాజ్ఞాని. సనత్కుమారుడి రూపంలో నారదాది మహర్షులకు బ్రహ్మోపదేశం చేసినవాడు అతడేనని 'ఛాందోగ్యోప నిషత్తు'లో చెప్పబడింది.

**కుమారిల భట్టు దిగ్విజయము :**

పరమేశ్వరుని పుత్రుడైన షణ్ముఖస్వామి 'కుమారిల భట్టు' అన్న పేరుతో భూమిపై అవతరించాడు. అప్పట్లో రాజుగా వున్న 'సుధన్వుడి'ని తన పాండిత్యంచేత మెప్పించాడు. అక్కడున్న పండితులందరినీ ఓడించాడు. అప్పుడు రాజుకు కూడా వైదిక ధర్మంపై విశ్వాసం కలిగింది. కాని పండితుల తృప్తికోసం కుమారిల భట్టును పరీక్షించాడు. పర్వతంపై నుండి క్రింద వడినా శరీరం ఏమీ కాకుండా కాపాడుకోవాలన్నది ఒక పరీక్ష. ఆ పరీక్షలో ఆయన గెలిచాడు. కాని పండితులు మంత్ర తంత్రాలచే శరీర రక్షణ చేసుకొని వుండవచ్చునని శంకించడంతో రాజు నిండు సభలో మూతికి బట్టకట్టిన కుండనొక దానిని చూపించి 'ఇందులో ఏముందో చెప్పండి. నిజానిజాలు తెలుస్తాయి' అన్నాడు. అప్పుడు అక్కడున్న పండితులు రాజు తమను కూడా పరీక్షించడంతో అవాక్కయ్యారు. ఆ కుండలో ఏముందో తెలియక, ఏం చెబితే ఏమవుతుందో తెలియక భయపడ్డారు. మూడు రోజుల గడువు అడిగినప్పటికి తప్పించుకున్నారు. ఎలాగో రాజు కుండలో పామునుంచాడని తెలుసుకొని జవాబు చెప్పడానికి సిద్ధమయ్యారు. కాని కుమారిలభట్టు బుద్ధిచేత ప్రేరితుడై, సూర్యోపాసనచేసి సభలో జవాబు చెప్పడానికి సిద్ధమయ్యాడు. పండితులు ఆ కుండలో వున్నది 'నాగరాజు' అని ఉత్తరమిచ్చారు. కాని కుమారిల భట్టు 'కుండలో నాగశయనుడైన విష్ణువే' వున్నాడని జవాబు ఇచ్చాడు. కుండలో వున్నదానిని పైకి తీయుమని రాజు చెప్పినప్పుడు ఆయన అనంతశయనమూర్తిని పైకి తీశాడు. దీనితో రాజు ఆయనను శరణువేడాడు. వాఙ్మయ తపస్సు చేసి జ్ఞానుల మాటలు, త్రికాల సత్యాలు అతడు తన బ్రహ్మ తేజంతో అక్కడున్న పండితులను ఓడించాడు. పరమేశ్వరుడు కాలడి శంకరుడిగా అవతరించడానికి ముందే భూలోకంలో సనాతన ధర్మానికి పీఠం వేయబడింది. ఆ కుమారిల భట్టు, భట్టపాదుడిగా ప్రసిద్ధుడయ్యాడు. అతని ముఖ్యశిష్యుడే మండన మిశ్రుడు.

**శ్రీ శంకరుల తల్లిదండ్రులు :**

**యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థానం అధర్మస్య తదాత్మానాం సృజామ్యహం॥**

అన్నట్లుగా ధర్మ-రక్షణ కోసం దిగి రావలసిన పరమేశ్వరుడు తనకు సరియైన ప్రదేశంగా దక్షిణ భారతదేశంలోని కేరళ రాష్ట్రాన్ని ఎన్నుకున్నాడు. దాక్షిణ్యం గల దక్షిణామూర్తి దక్షిణ దిక్కులోనే జన్మించాడు. పవిత్రాత్ములు తమకోసం నదీ తీరాలను ఎన్నుకుంటారు. పూర్ణానదీ తీరంలోని వృషభాద్రిలో మహాదేవుడు స్వయంభూలింగమై అవతరించాడు. అక్కడి రాజైన రాజశేఖరునికి స్వప్నంలో కనిపించి, ప్రేరణ నివ్వగా ఆరాజు అక్కడొక దేవాలయం నిర్మించాడు. అది ఒక పుణ్యక్షేత్రంగా విలసిల్లింది. దానికి దగ్గరలో 'కాలడి' అనే అగ్రహారముంది. రాజ, మహారాజుల నదీతీరంలో గల సారవంతమైన భూమిని

తరువాయి 15వ పేజిలో......

# మహాభారతంలోని నీతి కథలు

.. డాక్టర్ కె. వి. సత్యనారాయణ
సెల్: 9440732210

మహాభారతానికి విశ్వసాహిత్యంలోనే ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. లక్ష శ్లోకాలకు పైగా విస్తరించి ఉన్న మహాకావ్యమే ఈ భారతం. దీనికి సమానమైన గ్రంథం ప్రపంచ సాహిత్యాలన్నింటిలో ఎక్కడ వెదకినా కన్పించదంటే అతిశయోక్తికాదు. భారతం పంచమవేదం. సత్యం, ధర్మం ఈ రెండే విశ్వమానవాళికి శాంతి మార్గసాధనాలని, అవే ప్రశాంత జీవన పథాలని బోధించింది మహాభారతం. సమాజంలోని అన్ని వర్గాల వారికి, అన్ని వయస్సుల వారికి దిశా నిర్దేశం చేసే గ్రంథమే ఈ మహాభారతం.

అజ్ఞానమనే అంధకారం నుండి విముక్తుణ్ణి చేసి జ్ఞాన దీపాన్ని వెలిగించేవాడు గురువు. మరి అలాంటి గరువును సేవించడం ఎంత అవసరమో దాని ఫలితం ఎంతటిదో మహాభారతంలోని ఉదంకుని కథ తెలియజేస్తుంది.

మహాభారత కాలంలో పైలుడనే పేరుగల ఒక గురువు ఉండేవాడు. ఆయన దగ్గర ఎంతోమంది విద్యాభ్యాసం చేసేవారు. నిరంతరం గురు సన్నిధానంలో గురువు సేవ చేస్తూ శిష్యులు ఎంతో వినయ విధేయతలతో విద్య నేర్చుకునేవారు. గురువు కూడా వారిని కన్నబిడ్డలుగా చూసుకుని ఎవరికి ఏ విద్యలలో ఆసక్తి ఉందో గమనించి ఆయా విద్యలనే నేర్పించేవారు. పైలుని దగ్గర ఉదంకుడనే ఒక శిష్యుడుండేవాడు. వినయ విధేయతలతో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని ఇంటికి వెళ్ళడానికి గురువుగారి నుండి సెలవు తీసుకునే ముందు ఉదంకుడు ఆచార్యవర్యా! "గురుదక్షిణ ఏమివ్వాలో ఆజ్ఞాపించండి" అని అర్థించాడు. ఆ మాటలకు పైలుడు చిరునవ్వుతో "నాయనా! నీ వంటి శిష్యుడు దొరకడం నా వంటివాడి అదృష్టం" అని గురుదక్షిణను తిరస్కరిస్తాడు. ఉదంకుడు గట్టి పట్టు పట్టగా అతని పట్టుదల చూసి ముచ్చటతో "నాయనా! ఎంతో శ్రద్ధాభక్తులతో ఇంత కాలం సేవలు చేశావు. అంతకు మించిన గురుదక్షిణ అక్కరలేదు. అయినా నువ్వు పట్టుబట్టావు గనుక లోనికెళ్ళి అమ్మగారిని అడుగు" అనంటాడు. గురుపత్ని పౌష్యుడనే రాజుగారి భార్య ధరించే కుండలాలు కావాలని అడుగుతుంది. ఉదంకుడు అవి తేవడానికి బయలుదేరతాడు. మార్గమధ్యంలో వృషభం మీద వచ్చిన మహాపురుషుడు ఉదంకునితో "నాయనా! ఈ గోమయం భక్షించి వెళ్లు నీకు శుభం చేకూరుతుంది" అనంటాడు. ఉదంకుడు మారు మాట్లాడకుండా దాన్ని తిని రాజు గారింటికి వెళ్తాడు. మహారాజు చిరునవ్వుతో ఆహ్వానించి ఎంతో వినయంతో అతని రాకకు సమాచారం అడిగి తెలుసుకుని అంతఃపురానికి వెళ్ళి మహారాణిని అడగమని చెప్తాడు. ఉదంకుడు అంతఃపురానికి వెళ్ళి మహారాణికి తన రాకకు గల కారణం చెప్పగా, ఆమహారాణి విద్వాంసుల కోరిక తీర్చడం నా విధి అంటూ ఆ కుండలాలు ఇస్తూ "నాయనా! ఒక మాట. ఈ కుండలాలు దొంగిలించాలని తక్షకుడు కాచుకొని ఉన్నాడు. జాగ్రత్తగా తీసుకువెళ్ళు" అని చెప్తుంది.

ఉదంకుడు వాటిని తీసుకుని వేగంగా తిరుగు ప్రయాణమై వస్తుండగా సూర్యాస్తమయం అవుతుంది. ఆ కుండలాలు ఒక చెరువు గట్టున పెట్టి సంధ్యా వందనం చేయబోగా ఒక ముసలి బిచ్చగాడు వాటిని

దొంగిలించి పాముగా మారి ఒక బిలంలోకి వెళ్ళిపోతాడు. ఉదంకుడు ఆ బిలాన్ని పెద్దది చేయడానికి ప్రయత్నిస్తుంటే దేవేంద్రుడు వజ్రాయుధంతో ఆ బిలాన్ని విశాలం చేస్తాడు. ఉదంకుడు ఆ బిలం గుండా వెళ్ళి నాగలోకాన్ని చేరతాడు. నాగజాతిని ఎంతగా స్తుతించినా తక్షకుడు కనిపించడు. చివరకు ఒక మహాపురుషుడు అశ్వరూఢుడై కనిపించగా ఉదంకుడు అతన్ని స్తుతిస్తాడు. ఆ మహాపురుషుడు సంతసించి వరం కోరుకొమ్మంటాడు.ఉదంకుడు నాగలోకమంతా తన వశంలో ఉండాలని కోరుకుంటాడు. ఆ మహాపురుషుడు గుఱ్ఱం చెవిలో గట్టిగా ఊదమంటాడు. వెంటనే ఉదంకుడు ఆ పని చేయగా నాగలోకం నిండా అగ్ని జ్వాలలు వ్యాపిస్తాయి. వాటికి తట్టుకోలేక తక్షకుడు కుండలాలు సమర్పించి శరనాగతుడౌతాడు. ఉదంకుడు గురుపత్నీ వ్రత సమయానికి ఎలా వెళ్ళాలని చింతిస్తుండగా ఆ మహాపురుషుడు తన గుఱ్ఱం ఇచ్చి అదృశ్యుడౌతాడు. ఉదంకుడు కుండలాలను గురుపత్నికి సమర్పించి గురువైన పైలుని దర్శించుకుంటాడు. గరువుగారికి జరిగినదంతా వివరిస్తాడు. అప్పుడు పైలుడు చిరునవ్వుతో "నాయనా ఉదంకా! ఇంద్రుడు నాకు ప్రాణమిత్రుడు. నీవు నా శిష్యుడవు గనుక నీకు అడుగడుగునా సహాయం చేశాడు. నీ వలె భక్తి శ్రద్ధలతో, వినయ విదేయతలతో గురుశుశ్రూష చేసి విద్య నేర్చుకునే వారిని దేవతలు ఎప్పుడూ కాపాడతారు. నీకు సర్వశుభాలు చేకూరుగాక" అని ఇంటికి సాగనంపుతాడు. ☐

---

☐ 13 వ పేజి తరువాయి ......

బ్రాహ్మణులకు దానంగా ఇచ్చే ప్రదేశాలే అగ్రహారాలు. నీటి వసతి చక్కగా వుండే చోటనే అగ్రహారాలుండేవి. బ్రాహ్మణులకు ప్రతిదినం స్నానము, నిత్యానుష్ఠానము మరియు తర్పణాది వైదిక కర్మలకు నీరుకావాలి. మరి నీరు కోనేరులలో, నదులలో సమృద్ధిగా లభిస్తుంది. ముందుగానే పాత్రలలో పట్టి వుంచిన నీరు వైదిక కర్మలకు వాడటం శ్రేష్టంకాదు. కాని ఈనాటి పట్టణవాసంలో ఈ నియమం కుదరదు. అయితే వేదంలో ఒక చోట 'ఉధృత పరిపూతాభిః అద్భిః కార్యం కుర్వీత, అసంశయువాన్' అని చెప్పబడింది. అప్పటికప్పుడు పట్టిన నీటితోనే వైదిక కర్మలు చేయాలని వేదం చెబుతుంది. సంచిత అంటే కూడ బెట్టిన నీరు ఉపయోగించరాదనే దీని అర్థం. ఇలా స్వతంత్రంగా, సమృద్ధిగా నీటిని ఉపయోగించి కర్మానుష్ఠానాలు చేయాలంటే బ్రాహ్మణులు అగ్రహారంలోనే వుండాలి కాని నగరంలో వీలుపడదు. ఈ దృష్ట్యా కాలడి ఆదర్శ అగ్రహారమే. అక్కడున్న బ్రాహ్మణోత్తములలో 'విద్యాధిరాజు' సార్థక నామధేయుడు. ఆ పేరు ఆయనకు అన్వర్థక నామమైంది. కాలచక్రగమనంలో ఆయనకు వివాహమై సంతానం కూడా కలిగింది. ఆ బిడ్డకు తల్లిదండ్రులు 'శివగురు' అని నామకరణం చేశారు. ఆ శివగురువు బాల్యంలోనే తండ్రి దగ్గర వేదశాస్త్రాలను అభ్యాసం చేశాడు. ఆ తరువాత గురుకులంలో చేరి మరింత విద్యావంతుడైన అతనిని చూచి తండ్రి పుత్రోత్సాహంతో పొంగిపోయాడు. 'పుత్రాదిచ్ఛేత్ పరాజయం' (విద్యాది విషయములలో తండ్రి తన బిడ్డలచేతిలో ఓడిపోవాలని కోరుకుంటాడు) అని చెప్పారుగా! విద్యాధిరాజుకు అలాంటి పుత్రుడిగా శివగురువు లభించాడు. అతడు జ్ఞానంలో, శివుడిలా, వాక్కులో బృహస్పతిలా ప్రసిద్ధుడయ్యాడు. ప్రతి వ్యక్తికీ తన పేరు చాలా ఇష్టం. దాన్ని సార్థకం చేసుకుంటే ఇహపరాలు రెండూ అనుకూలిస్తాయి. శివగురువు తన విద్యాభ్యాసం ముగించినప్పటికీ ఇంకా గురు కులంలోనే నైష్ఠికుడిగా, బ్రహ్మచారిగా వుంటానని పట్టుబట్టాడు. కాని తండ్రి ఒప్పించి ఇంటికి తీసుకువచ్చాడు. ☐

# సనాతన ధర్మము - దాని విశిష్టత

...... స్వామి ముకుందానంద సరస్వతి, ఋషికేష్; 09410990829

## తృష్ణ లేక లోభం

నిర్వచనము :

**శ్లో॥ పర విత్తాదికం దృష్ట్వా నేతుం యోహృది జాయతే।**
**అభిలాషా ద్విజశ్రేష్ఠ ! సలోభః పరికీర్తితః ॥**

పరుల యొక్క ధనము మొదలగు వానిని చూచి, వాటిని పరిగ్రహించి తన స్వంతము చేసికొనవలెననెడి అభిలాష హృదయములో కలుగటనే 'తృష్ణ' లేక 'లోభం' అని చెప్పుదురు.'

దుర్గుణములలో కెల్ల తృష్ణ అతి బలవత్తరమయినది మరియు సర్వానర్థములకు మూలకారణము. మానవుని యొక్క పతనమునకు లోభమే కారణము. లోభం ఉన్నవానికి మిగిలిన దుర్గుణములన్నియు ఉన్నట్లే. లోభియగు మానవుడు అత్యాశతో ధనమును కూడబెట్టను. తన నిత్యావసరములకు గూడ ఖర్చుచేయక, తాను అనుభవింపక, ఇతరులను అనుభవింపనీయక, లోభి బహు కష్టముల పాలగును. మానవుడు తృష్ణవలన ఇహ పర సుఖములను కోల్పోయి, దుఃఖముల ననుభవించును. సమాజంలో లోభియగు మానవుడు గౌరవప్రతిష్ఠలను బడయుజాలడు. మానవుడు తృష్ణవలన పరవిత్తమునకై ప్రాకులాడుచు, నీచాతినీచమైన కార్యములు నొనర్చును.

''ఆశకు అంతులేదు'' అనునుడవి మనము వింటూనే యున్నాము. ఎంత లభించినను తృష్ణ సంతుష్టిచెందదు. లభించుకొలది ఇంకా లభించనెడి ఆశ పెరుగుతూనే యుండును. ఈ తృష్ణ ఎటువంటి ఉపద్రవము చేతగాని అంతమొందునదియుకాదు.

తృష్ణ ఎట్లు దినదినాభివృద్ధిని పొందునో ఈ క్రింది సూక్తి వివరించుచున్నది.

**శ్లో॥ యౌవనం జరయాగ్రస్త మారోగ్యం వ్యాధిభిర్హతమ్**
**జీవితం మృత్యుర్భ్యేతి తృష్ణైకా నిరుపద్రవా ॥**

'మానవునికి బాల్యం, కౌమారం, యౌవనం, వార్థక్యం అనే నాల్గుదశలున్నాయి. అందులో యౌవనాన్ని వార్థక్యం కబళించివేస్తుంది. ఆరోగ్యాన్ని వ్యాధులు నశింపచేస్తాయి. జీవితాన్ని మృత్యువు హరించును. తృష్ణ (ఆశ) మాత్రం ఏ ఉపద్రవము లేకుండా దినదినావృద్ధిని గాంచును'.

''ఆశాపాశము తా కడున్నిడువు లేదంతంబు'' అని భాగవతం చెప్పినట్లుగా ఆశ అనే త్రాడు ఎంత పొడవు ఉన్నదో ఎవరికిని అంతు చిక్కని విషయము తృష్ణకు అంతం అంటూ కనిపించుట లేదు.

మనిషి పెరుగుకొలది తృష్ణ గూడ పెరుగుచునే యుండునను విషయమును చక్కని ఉపమానముతో క్రింది సూక్తి వర్ణించుచున్నది.

**శ్లో॥ యథా హి శృంగం గోః కాలే వర్ధమానస్య వర్ధతే ।**
**ఏవం తృష్ణాఽపి చిత్తేన వర్ధమానేన వర్ధతే॥**

'గోవు పెరిగే కాలములో దానియొక్క కొమ్ములు గూడ పెరుగుచూనే యుండును. అలాగుననే మనిషియొక్క వయస్సు పెరిగే కొలదీ అతని యొక్క మనస్సు, మనస్సుతో పాటు తృష్ణగూడా పెరుగుచునే యుండును'.

తృష్ణాయుక్తమైన కష్టములు గూడా పెరుగుచునే యుండును. అందువలన వివేకియైన ముముక్షువు తృష్ణను వృద్ధిపొందనీయక వైరాగ్యాన్ని పెంచుకొని, సాధనను కొనసాగించవలయునని సనాతన ధర్మము బోధించుచున్నది.

ఈ క్రింది శ్లోకములలో తృష్ణఎలా పెరుగుతూ పోతుందో చక్కగా వర్ణింపబడినది :

**శ్లో॥ ఇచ్ఛతి శతీ సహస్రం ససహస్రః కోటిమీహతే కర్తుమ్।**
**కోటియుతోఽపి నృపత్వం నృపోఽపి బత చక్రవర్తిత్వమ్॥**

**శ్లో॥ చక్రధరోఽ పి సురత్వం సురోఽపి సురరాజ్యమీహతే కర్తుమ్।**
**సురరాజోఽ పూర్ధ్వగతిం తథాఽ పి న నివర్తతే తృష్ణా ॥**

'మానవుని యొక్క తృష్ణ మొదట నూరుతో ప్రారంభమవును. నూరు లభించిన వెనుక వెయ్యి కొరకు ఇచ్ఛ కలుగును. వెయ్యి లభించిన తరువాత కోటి కొఱకు, కోటి లభించిన వెనుక రాజత్వం కొరకు, రాజత్వం లభించిన తరువాత చక్రవర్తిత్వం కొరకు, చక్రవర్తిత్వం తరువాత దేవత్వం కొరకు, దేవత్వం లభించిన తరువాత లభించిన తరువాత ఇంద్రపదవి కొఱకు, ఇంద్రపదవి లభించిన వెనుక దానికంటె గొప్ప పదవికొఱకు - ఇలాగున తృష్ణ పెరుగుచునే పోవును. అన్నిటి కంటె గొప్ప పదవి లభించి నప్పటికీ తృష్ణ అంతటితో ఆగదు. తృప్తి పడదు'.

కావున, తృష్ణకు అంతం అంటూ లేదు. అందువలన మానవుడు తృష్ణను వృద్ధిబొందనీయక, వైరాగ్యమును పెంచుకొని, లభించిన దానితో తృప్తిపడవలయునని సనాతనధర్మము బోధించుచున్నది.

తృష్ణ ఎంత బలవత్తరమైనదో యీ క్రింది సూక్తి వివరించుచున్నది :

**శ్లో॥ అపి మేరూపమం ప్రాజ్ఞమపి శూరమపి స్థిరమ్।**
**తృణీకరోతి తృష్ణైకా నిమేషేణ నరోత్తమమ్ ॥**

'తృష్ణ చాలా బలవత్తరమైనది. అది ఎంత గొప్పవానినైనా వశపఱచుకొనును. మేరు పర్వతమంతటి ఉన్నతుడైనవానినైనా, మహావివేకియైన వానినైనా, గొప్ప శూరుడైనవానినైనా అది ఒక్క నిమిషములో తృణీకరిస్తుంది. వారిపై పెత్తనము చెలాయించి లొంగదీసుకుంటుంది'.

కాబట్టి, మానవుడు తృష్ణ యొక్క శక్తికి మించిన దృఢసంకల్పమును కలిగియుండి, దానినే లొంగదీసుకొని, అదుపులో నుంచవలయును.

ధనము లేనివాడు కాదు పేదవాడు, ఎంత ధనమున్నను తృప్తిపడక, ఇంకను కావలెనని ప్రాకులాడువాడే పేదవాడు. పేదరికానికి పరాకాష్ఠ లోభమే కాని ధనము లేకుండుట కాదు అని ఈ క్రింది సూక్తి చాటుచున్నది.

**శ్లో॥ దారిద్ర్యస్య పరామూర్తి స్తృష్ణా న ద్రవిణాల్పతా ।**
**జరద్గవధనశ్శంభుస్తథాఽ పి పరమేశ్వరః॥**

'దారిద్ర్యమునకు పరాకాష్ఠ తృష్ణయే కాని ధనము యొక్క కొరతకాదు. అధికముగా ధనము లేకున్నా ఉన్నదానితో సంతృప్తిని జెంది జీవించే వారెందరో గలరు. స్మశానములో నివసించే శంకరునికున్న ధనమంతా ఆయనకు వాహనమైన ముసలి నంది మాత్రమే. అయినప్పటికి ఆయన "పరమేశ్వరుడు"గా ప్రసిద్ధికెక్కినాడు'. పరమేశ్వరుడంటే మహాదేవుడనేగాక 'గొప్ప ధనికుడు' అని కూడా అర్థమున్నది.

కావున, ఉన్నదానితో తృప్తి పడేవాడే గొప్ప ధనవంతుడు గాని, అధికముగా ధనమున్నవాడు కాదు. అధికముగా ధనముండియు, తృప్తిలేక ధనము కొఱకు ప్రాకులాడువాడు పేదవాడుగానే పరిగణింపబడును.

❑ తరువాయి 33వ పేజిలో......

# ఈశ్వర కటాక్షం



- గోనుగుంట మురళీకృష్ణ టీచర్, రేపల్లె సెల్:9701260448

పరమేశ్వరుడు విశ్వేశ్వరుడై అవతరించిన పుణ్యస్థలం కాశీ క్షేత్రం. అక్కడ గంగానదిలో స్నానం చేసి, విశ్వేశ్వరుని దర్శించుకున్నవారు పాపాలన్నీ నశించిపోయి కైలాసం చేరుకుంటారు. అక్కడ తిథి, వార, నక్షత్రాలతో సుముహూర్తాలతో పనిలేదు. ప్రతిరోజూ సుదినమే. జీవిత చరమాంకంలో కాశీలో తనువు చాలించాలని ప్రతి మనిషి కోరుకుంటాడు. కానీ అందుకు ఈశ్వర కటాక్షం ఉండాలి. శివ కటాక్షం లేనివాడు ఏ బలంతో వెళ్ళినా కాశీని చేరుకోలేడు. అందుకు ఉదాహరణ ఈ కథ.

దక్షిణ సముద్రతీరాన గల ఒక గ్రామంలో ధనుంజయుడనే యువకుడు ఉన్నాడు. అతనికి తల్లి తప్ప ఎవరూలేరు. తల్లి అంటే అతనికి ప్రాణం. వివాహం చేసుకుంటే తల్లి సేవచేసుకోవటానికి భార్య అడ్డువస్తుందేమో, పిల్లలు ప్రతి బంధకాలు అవుతారేమోనని అవివాహితుడిగానే ఉండిపోయాడు.

కొంత కాలానికి ఆమెకు మరణకాలం ఆసన్నమైంది. కుమారుడిని దగ్గరకు పిలిచి, "నాయనా! నేను జీవించి ఉన్నంతకాలం నీ సపర్యలతో సంతృప్తి కలిగించావు. కానీ నాకు తీరని కోరిక ఒకటున్నది. జీవితంలో ఒక్కసారైనా కాశీ విశ్వేశ్వరుని దర్శించుకోవాలనుకున్నాను. కానీ ఆ కోరిక తీరకుండానే మరణిస్తున్నాను. కనీసం నా అస్థికలనైనా కాశీలోని గంగానదిలో నిమజ్జనం చెయ్యి. నా ఆత్మ శాంతిస్తుంది'' . అన్నది.

''అలాగే నమ్మా! ఈ లోకంలోనైనా, పరలోకంలోనైనా కన్నవారికి సంతృప్తి కలిగిస్తే కదా పుత్రుడు! ఎన్ని అవస్థలైనా పడి గంగలో కలుపుతాను. తల్లి ఋణం తీర్చుకుంటాను'' అని మాట ఇచ్చాడు.

ఆ తల్లి సంతృప్తిగా కన్నుమూసింది. ధనుంజయుడు తల్లి దహన సంస్కారాలు నిర్వహించిన తర్వాత అస్థికలను తీసుకుని పూలతో పూజించాడు. పట్టుబట్టలో పదిలపరచాడు. ఆ మూట ఒక సంచిలో ఉంచాడు. ఆ సంచిని ఒక రాగిపెట్టెలో పెట్టి తాళం వేసి భద్రపరచాడు.

వంటగిన్నెలు, పక్కబట్టలు, ఇతరమైన సంభారాలు మొదలైనవి ఒక కావడిలో పెట్టకుని, కావడి భుజాన మోసుకుంటూ కాశీకి ప్రయాణమయ్యాడు. పగలంతా కాలినడకన ప్రయాణం చేయడం, చీకటి పడేవేళ అనువైన ప్రదేశం చూసుకుని వంట చేసుకుని తిని, విశ్రాంతి తీసుకుని మళ్ళీ వేకువనే ప్రయాణం కొనసాగించటం చేశాడు. ఇలా ఎన్నో దేశాలు దాటాడు.

అలా ప్రయాణం చేసి, చేసి విపరీతమైన మార్గాయాసం వల్ల అస్వస్థకుగురయ్యాడు. శక్తి క్షీణించింది. ఇక వంటరిగా ప్రయానించటం కష్టం, తోడుగా మరొక మనిషి ఉంటే బాగుంటుందని భావించి ఒక పల్లెను చేరుకున్నాడు. అక్కడ గోపయ్య అనేవాడిని కావడి మోయటానికి నియమించుకున్నాడు. ఇద్దరూ మళ్ళీ బయలుదేరారు.

ఒకరోజు చీకటి పడేవేళకి ఒక పాడుబడిన మండపం

దగ్గర ఆగారు. "ఈ రోజు రాత్రికి ఇక్కడ విశ్రాంతి తీసుకుందాం. నేను సమీపంలోని గ్రామానికి వెళ్లి మనం వంట చేసుకోవటానికి కావలసిన బియ్యం, పప్పులు, నెయ్యి మొదలైనవి కొనుక్కుని వస్తాను. నువ్వు ఈ లోపు ఇక్కడ దుమ్ము, ధూళి శుభ్రం చేసివుంచు'' అని చెప్పి ధనుంజయుడు అంగడికి వెళ్ళాడు.

గోపయ్య ఆలోచించాడు. "ఇతడు ఈ రాగిపెట్టె వదలకుండా వెంటపెట్టుకునే ఉంటున్నాడు. ఇందులో రత్నాలు, వజ్రాలు ఏవో విలువైనవే ఉండవచ్చు. ఈయన ఇచ్చే బత్తెం నాకు ఏ పాటిది ? ఈ పెట్టె అపహరించి తీసుకు వెళితే చాలా కాలంపాటు సుఖంగా జీవించవచ్చు'' అనుకుని రాగిపెట్టె తీసుకుని ఉడాయించాడు.

ధనుంజయుడు అంగడి నుంచీ వచ్చి చూసేసరికి గోపయ్యలేడు, రాగిపెట్టె లేదు. జరిగినది గ్రహించాడు. "అయ్యో! ఆ వెర్రివాడు అందులో ధనం ఉన్నదనుకుని తీసుకువెళ్ళాడు కాబోలు. ఎలాగైనా అతడిని వెతికి పట్టుకుని పెట్టె మళ్ళీ తెచ్చుకుంటాను'' అనుకుని గోపయ్య ఉండే పల్లెకు వెనుతిరిగి బయలుదేరాడు.

కొంతదూరం వెళ్ళిన గోపయ్య ఒక అడవిలో ప్రవేశించిన తర్వాత రాగి పెట్టెలో ఏముందో తెలుసుకోవాలనే కుతూహలంతో తాళం పగులగొట్టి సంచిలోని మూట విప్పాడు. చూడగానే అంతెత్తున ఎగిరిపడ్డాడు. అందులో ఎముకలు తప్ప ఏమీలేవు. వాడు తన దుర దృష్టాన్ని తానే తిట్టుకున్నాడు. 'రత్నరాశులు ఉంటాయనుకుని దారిబత్తెం కూడా తీసుకోకుండానే వచ్చానే! అంతా నాఖర్మ!'' అని నుదురుకొట్టుకున్నాడు. కసిగా ఎముకలను దూరంగా గిరాటువేశాడు.

ధనుంజయుడు గోపయ్య ఉండే పల్లెకు చేరుకుని అతని ఇల్లు వెతికి పట్టుకున్నాడు. అతని భార్యతో జరిగినదంతా చెప్పాడు. "నీ భర్త దారి బత్తెం తీసుకోకుండానే వచ్చేశాడు. ఇదిగో! నా తల్లి అస్థికలను నాకు ఇచ్చివేస్తే కొంత బహుమానం కూడా ఇస్తాను. అవి ఇప్పించి పుణ్యం కట్టుకో తల్లీ!'' అని బ్రతిమిలాడాడు. గోపయ్య భార్య భర్తను చివాట్లు వేసింది. అస్థికలను ఎక్కడ పారేశాడో ఆ ప్రదేశం చూపించమని చెప్పి పంపించింది.

దనుంజయుడు, గోపయ్య అరణ్యం చేరుకున్నారు. అది మహారణ్యం కావటం వల్ల అస్థికలను పారేసిన చోటు గుర్తించలేకపోయాడు గోపయ్య. అక్కడనీ, ఇక్కడనీ తిరిగినచోటే తిరిగాడు. నడచిన దిక్కే నడిచాడు. తిరిగి తిరిగి కాళ్ళు బలపాలు కట్టాయి. ఎంత ప్రయత్నించినా ఆ చోటు వాడు గుర్తించలేకపోయాడు. ఇద్దరూ నిరాశ పడ్డారు.

"అయ్యో! ఎంత కష్టపడ్డా తల్లి చివరికోరికను తీర్చలేకపోయానే! అని చింతిస్తూ ధనుంజయుడు ఇంటిదారి పట్టాడు. గోపయ్య తన పల్లెకు తిరిగి వెళ్ళాడు.

ధనుంజయుడు ఎంత మాతృభక్తి కలవాడైనా అతనికి ఈశ్వరానుగ్రహం లభించలేదు. పరమేశ్వర కటాక్షం లేనిదే ఎవరికీ కాశీ ప్రవేశం లభించదు. ఏ బలంతో వెళ్ళినా విడవని విఘ్నాలవల్ల పడరాని పాట్లు పడతాడే తప్ప కాశీ ఫలం లభించదు. అందుకు పూర్వ జన్మలో చేసుకున్న పాపపుణ్యాలే కారణం. అందుకే శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అంటారు పెద్దలు.

(మూలం : శ్రీనాథ మహాకవి రచించిన "కాశీఖండం'') □

# సుమతిత్వము

.... బ్రహ్మశ్రీ బొడ్డు పల్లి పవన్ కుమార్ అవధాని, గుంటూరు

ఈ పద్యరత్నం ఆంధ్ర మహాభాగవతం సప్తమస్కంధంలో విరాజిల్లుతున్నది. హిరణ్య కశిపుడు తన తమ్ముడైన హిరణ్యాక్షుని మరణాంతరం శ్రీహరి పై పగ బూని ప్రతీకారంతో రగిలిపోతూ మరణం లేకుండా వరం పొందడానికి విధాతను గురించి తీవ్ర తపమాచరిస్తాడు. బ్రహ్మదేవుడు నీ కేం ? వరం కావలె? కోరుకొమ్మని అనుజ్ఞనివ్వగా

**ప॥ గాలింగుం భినినగ్నినంబువులనాకాశస్థలిన్ దిక్కులన్**
**రేలన్ ఘస్రములన్ దమఃప్రభలభూరి గ్రాహరక్షోమృగ**
**వ్యాళాదిత్యనరాది జంతుకల హవ్యాప్తన్ సమస్తా స్త్రశ**
**స్త్రాళిన్ మృత్యువులేని జీవనములో కాధీశ! యిప్పించవే!**

అంటూ అసాధ్యమైన పెద్దవరాన్నే కోరతాడు హరివైరి. దానికి విధాత నివ్వెరపోయి అతడి తపోదీక్షకు మెచ్చుకున్నందువల్ల వరమివ్వక గత్యంతరం లేని పరిస్థితుల్లో వరాన్ని యిచ్చి ఈ వరం జాగ్రత్తగా వాడుకుంటే నీతలరాత మారుతుందని సూచిస్తాడు. ఆ సూచన ప్రహ్లాద జనకునికే కాదు శాస్త్ర విజ్ఞానంతో విర్రవీగే మనకూ వర్తిస్తుంది. ఈ పద్యాన్ని విందాం. ఆసందేశాన్ని సమస్త మానవాళికీ వినిపిద్దాం.

ప॥ అన్నా! కశ్యపపుత్ర! దురభములీయర్థంబులెవ్వారికి
మున్నెవారలు గోరరీవరములన్ మోదించి తిన్నీ యెడ
నన్నుగోరిన వెల్ల నిచ్చితి బ్రవీణత్వంబుతో బుద్ధి
సంపన్న త్వంబుననుండుమీ! సుమతి వైభద్రై కశీలుండవై!!

అందమైన పద్యరత్నాన్ని విన్నారుగా మరి భావాని కొద్దామా! నాయనా! హిరణ్యకశిపా! నీ వడిగిన ఈ వరాలన్నియు కడు దుర్లభములు. ఇట్టి అసాద్యమైన వరాలను ఇంతకు ముందు ఎవ్వరూకూడా కోరలేదు. నీవు ఆచరించిన ఉగ్రతపస్సుకు నేను మెచ్చితిని. అందులకే నీవు కోరిన వరాలన్నింటినీ ఇచ్చాను. నేర్పుతో బుద్ధి సంపన్నతతో మంచి బుద్ధికలవాడవైజాగ్రత్తగా జీవింపుము.

భావాన్ని విన్నారుగా ! పోతే ఇక వ్యాక్యానానికి వద్దాం.

ఇందులో ఏమున్నది ? హిరణ్య కశిపుడు వరాల డిగాడు విశ్వకర్తచతురాననుడు ఇచ్చాడు. అంతేకదా! అనిపిస్తుంది. మనందరికీ అనంతమైన అంతరార్థందాగుంది నరులను సృష్టించే నలువనరులకు తండ్రేకదా! అందుకే హిరణ్య కశిపుడు లాంటి లోకకంటకుడుకూడా తండ్రికి బిడ్డడే అందుకే అన్నా! అని ఆప్యాయతతో సంతోషించాడు. ''ఇంతవరకూ ముల్లోకాల్లో ఇలాంటి వరాలెవ్వరూకోరలేదు. ఇవన్నీ దుస్సాధ్యములు. నీవు కోరావు. నీవు ఒనరించిన తపోదీక్ష నాకు మిక్కుటంగా ప్రమోదాన్ని కలిగించింది. అందుకే అన్యుల కసాధ్యమైన వరాలు నీకు ఇస్తున్నాను. వాటిని జాగరూకుడవై ఉపయోగించుకోమంటూ'' మూడు విశేషాలను వాడాడు విరించి. ప్రవీణత్వము బుద్ధిసంపన్నత, భద్రై కశీలత్వము అనునవే ఆ మూడు విశేషణాలు మానవునకు ప్రథమంగా కావలసినది సుమతిత్వము అంటే మంచి బుద్ధికుశలత అది వుంటే మిగిలిన వన్నీ విశ్వశ్రేయస్సును కలిగిస్తూ తనకు పరిపూర్ణత్వాన్ని ఇస్తుంది. ప్రవీణతబుద్ధి సంపన్నత తనకు పరిపూర్ణత్వాన్ని ఇస్తుంది. ప్రవీణత, బుద్ధి సంపన్నతలు దుర్మార్గులకు కూడా వుంటాయి. అందులకే సమత్వముంటే భద్రైకశీలత్వం లభిస్తుంది.

మనం కూడా సుమతులమై ప్రవర్తిద్దాం. □

# యోగవాసిష్ఠ కథాలహరి

డా|| ధారారామనాధశాస్త్రి, ఒంగోలు

## ముగ్గురు రక్కసుల ముచ్చట

కథా కథనం కొనసాగిస్తున్న శ్రీవసిష్ఠులు ఇలా అన్నారు. 'రఘువరా నీకు దామ వ్యాళ కటక న్యాయం వద్దయ్యా. భీమ భాస దృఢస్థితి అవలంబించు. శోకరహితుడవై సుఖపడతావు' అని. ఇదేదో పొడుపు కథలాగ ఉన్నదే వివరించండి మహాత్మా అన్న శ్రీరాముని ఆసక్తిని పురస్కరించుకొని బ్రహ్మర్షి ప్రవచిస్తున్నారు

అది పాతాళలోకం. అందొక కుహరంలో మహా మాయా కోవిదుడు పరాక్రమశాలి నిరత విజయశీలి - అయిన శంబరాసురుడు నివసిస్తున్నాడు. అతనికి ఎల్లప్పుడూ దేవతలపై దండెత్తడం వాళ్లని మట్టికరిపించి కష్టాల పాలు చేసి వినోదించడం ఒక దినచర్యలాంటిది. ఉన్నట్టుండి ఒకనాడు శంబరుని మనస్సులో ఊహ ఒకటి మసలి, అతడు తన మాయాశక్తి చేత ముగ్గురు అసురులను తన సేవార్థమూ దేవపీడనార్థమూ సృజించాడు. వాళ్ల పేర్లు దాముడు, వ్యాళుడు, కటకుడు. ముగ్గురూ మహావీరులు ముల్లోకాలను జయించగల మహిమగలవారు. అందుచేత వాళ్ళని శంబరుడు దేవలోక దండయాత్రకి పురమాయించాడు. వాళ్ళు అసహాయశూరులై విజృంభించి దేవతలపై అనన్య విజయం సాధించారు. రామా! ఇక్కడొక విషయం చెప్పాలి. శంబరుని చేత సృష్టింపబడిన ఆ ముగ్గురికీ అది తొలి జన్మ. అంటే పూర్వజన్మల తాలూకు వాసనా సంస్కారాలు గాని అహంకార, మమకారాలుగాని పనిచేయని స్థితి. ముగ్గురు రక్కసుల వీర విజృంభణానికి తట్టుకోలేక విలవిల్లాడి పోయిన దేవతలు బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళి తమ కష్టస్థితిని చెప్పుకొని ఏదైనా మార్గముపదేశించి యీ కష్టములనుండి తమకు విముక్తి కలిగించవలసినదిగా ప్రార్థించారు. బ్రహ్మదేవుడు కొంచం సేపు మౌనం వహించి ధ్యానమగ్నుడై కన్నులు తెరచి ఇలా సెలవిచ్చాడు. ''దేవతలారా భయపడవద్దు. వాసనారూపవైన అహంకార మమకారాలు ఆశాపాశాలు బంధించని స్థితిలో ఉన్న ఆ ముగ్గురు రక్కసులూ మీమీద అలవోకగా గెలుపొందారు. కొంతకాలం గడిచాక వాళ్ళకీ అహంకార మమకారాలు కర్తృత్వభావన, ఆశ, తృష్ణలాంటి లక్షణాలు పెల్లుబికి మీచేత తప్పనిసరిగా ఓడిపోతారు. తరివేచి గరిచూచి దెబ్బతీయండి''.

కొంతకాలం గడిచింది. మళ్లీ యుద్ధ కండూతి విజృంభించగా ఆ ముగ్గురు రాక్షసులూ శంబరునిచేత అపార సన్మాన గౌరవ ప్రశంసలను పొంది అహంకృతులై దేవలోకాన్ని ముట్టడించారు. కాని ఈసారి విజయం దేవతలను వరించింది. రామచంద్రా! గమనించావుకదూ. విజయతృష్ణ మొదలైన లక్షణాలు విజృభించిన అసురవీరులు అణిగిపోయారు. బ్రహ్మ ఉపదేశంచేత నిర్మమ నిరహంకార సమరంచేసిన దేవతలు విజయులైనారు.

**ధీరో వ్యపి బహుజ్ఞోపి కులజోపి మహానపి**
**తృష్ణయా బధ్యతే జంతుః సింహః శృంఖలయా యథా**

(ధీరుడైనా, పండితుడైనా, కులీనుడైనా, గొప్పవాడైనా,

గొలుసులచే సింహంలాగ తృష్ణచే బంధింప బడతాడు.)

మహాద్భుతమైన నీతిని తత్త్వోపదేశాన్ని అవధరించి ఆనందించి రాముడు 'ఎంతమంచి విషయం ప్రవచించారు మహాత్మా. నిజంగా ఇది ఎవరి జీవితానికైనా పథ నిర్దేశకమైన ధృవతార' అన్నాడు.

ఆసక్తితో 'గురూ! అహంకార తత్త్వం చాలా ఆసక్తి జనకంగా ఉన్నది. మరికొంత వినాలనిపిస్తున్నది.' అని ప్రశ్నించిన రాముని కుతూహలాన్ని పురస్కరించుకొని వసిష్ఠులు కొనసాగిస్తున్నారు.

రామా! చాలా మంచి విషయం అడిగేవయ్యా! విను. అహంకారం మూడు విధాలుగా ఉంటుంది. నేనే సర్వము, విశ్వమునేనే, పరమాత్మయైన నేనే, నేను అచ్యుతుడను. (అంటే వినాశం లేని వాడను) నాకంటే అన్యము విశ్వములో లేదు, అన్న భావన మానవుని బంధాలు తొలగించి జీవన్ముక్తుని చేస్తుంది. ఈ 'అహం' మోక్షమార్గము. నేను సమస్త దృశ్య జగత్తుకంటే వేరుగా ఉన్నాను. కేశాగ్ర భాగంలో నూరవ వంతులాగా అతి సూక్ష్మరూపుడనై ఉన్నాను అనుకునేది శుభాహంకారము. నిజానికి ఈ రెండు బావాలనూ మాటవరసకి అహంకారాలు అన్నామేకాని ఇవి మోక్షసాధన మార్గాలు. అసలు మానవ పతనానికి దారితీసే అహంకారం మూడవది. అది లౌకికాహంకారం. శత్రువు లాగ వర్జించి దూరము చేయవలసినది. హస్తదేహాది మాత్రమైన ఈ శరీరమే నేను అనే దేహాత్మ భ్రాంతితో మొదలై సర్వవిధ మమకారాలకి తృష్ణలకే దారితీసే ఈ అహంకారాన్నే సాధనచే జయించి స్వస్వరూప సంధాన సాధన చేయాలి. అని చెప్పి రామా కథ ముగియలేదు. ఓ చిన్న కొనమెరుపున్నది. అదీ విను అంటూ కొనసాగించారు.

తాను సృష్టించి పంపిన వీరులు దేవతలచేత పరాజితులు కావడం తనకు అవమానంగా భావించిన శంబరుడు ఈసారి మరొక ముగ్గుర్ని సృష్టించాడు. పూర్వం సృష్టించిన దామ, వ్యాళ, కటకుల్లాగా కాకుండా ఈసారి ముగ్గురూ భీమ-భాస-ధృడులు అనే పేర్లు కలవారు. మొదటి వానిలో నిరంతరవ్యగ్ర నిర్నిద్రభావన, రెండవ వానిలో ప్రకాశము, తేజస్సు, మూడవ వానిలో గట్టి సంకల్పము నెలకొన్నవి. ఎంత కృషి చేసినా మరెంత సాధించినా అహంకారమునకు గురికానివారు. శంబర ప్రేరణచేత వీరు ముువ్వురూ, బయలుదేరి దేవతలను ముట్టడించి తీవ్రయుద్ధం చేసి విజయం సాధించారు. రామా! ఈసారి దేవతా సైన్యం యధాయధలై హిమాలయం నుంచి గంగా నదిలాగా పరుగెత్తి పోయింది.

కాబట్టి రామచంద్ర ప్రభూ! అహంకార బద్ధుడు కాకుండా మానవుడు సాధన చేసి స్వర్గాన్ని పొందాలి. తాత్పర్యంగా

**"ఆశా పాశ శతా బద్ధా వాసనాభావ ధారిణః**
**కాయా త్కాయముపాయాంతి వృక్షాద్వృక్షమివాణ్డజాః**
**క్షురధార ప్రతిమయాధియా పరమ ధీరయా**
**ప్రవిచార్యాత్మనస్తత్త్వం తతః స్వపదమావిశ - "**

ఆశలు అనే తాళ్ళచే బంధింపబడ్డవారు వాసనాయుక్తులు అంటే అజ్ఞాన బద్ధులు ఒకచెట్టు మీద నుండి మరొక చెట్టుమీదికి పోయే పిట్టల్లాగా ఒకదేహం నుండి మొరక దేహాన్ని పొందుతుంటారు. ఇది మామూలు జీవుల పద్ధతి. నీవు అలా కాకుండా కత్తియొక్క అంచులాగ (వివేక వైరాగ్యములచే) పదును పెట్టినదీ, మనోధైర్యంతో కూడుకొన్నదీ అయిన బుద్ధిచే ఆత్మతత్త్వాన్ని బాగా విచారణ చేసి క్రమంగా స్వర్గీయమైన ఆత్మ పదాన్ని ప్రవేశించు.

# విశ్వాసముంటే విధినైన ఎదిరించవచ్చు

.....ఆంధ్రరత్న జివి శేషారెడ్డి

విశ్వాసానికి పరిపదం నమ్మకము. ఆంగ్లములో Trust (or) Faith మానవుడు చేసే ప్రతి పనిలో విజయం విశ్వాసముమీద ఆధారపడి ఉంటుంది. సకారాత్మకత (Positive Attitude) అనే విత్తనము నాటితే విశ్వాసము అనే చెట్టుపుట్టి గమ్యం అనే ఫలాన్ని ఇస్తుంది. పాజిటివ్ అప్రోచ్ (సకారాత్మకత) ప్రతిమనిషికి అత్యంత ఆవశ్యకము. సకారాత్మకత మనిషిని ఎపుడు కూడా విశ్వాసాన్ని పెంచి విజయంవైపు ఉరకలేస్తుంది. విజయం సత్యం, దాన్ని సొంతం చేసుకోవాలంటే నమ్మకం తప్పనిసరి. 'స్వామి వివేకానందుడు' నీ విధికి నీవే శిల్పివి' అన్న సూక్తిని పరిశీలిస్తే ప్రతి మానవుడు తనవిధిని తానే వ్రాసుకొంటాడు. "యద్ భావం తత్ భవతే" అని అన్నాం. మనకున్న భావాలను బట్టే ఫలితం ఉంటుంది. మర్రి విత్తనం నాటితే మర్రిచెట్టు వస్తుంది. ఆలోచనలను విశ్లేషిస్తే, విచారిస్తే, శోధిస్తే, పరిశోధిస్తే ఫలితము విజయమే గదా! ఆదిమ మానవుని దగ్గర నుంచి నేటి ఆధునిక మానవుని వరకు గమనిస్తే మనిషి తలంపులు, (ఆలోచనలు), తత్వాన్ని గమనిస్తే విజయం గమ్యం సొంతమే కదా! చరిత్ర సృష్టించుకొని చిరస్మరణీయ లుగా వినుతి కెక్కిన ప్రతి మానవుని, ఏ రంగంలోనైన జీవిత చరిత్రలు గమనిస్తే వారి గమ్యాన్ని ఛేదించి విజయాన్ని సొంతం చేసుకోవడానికి నాంది విశ్వాసమే.

మానవ జన్మ మహనీయుమైనది. 74 లక్షల జీవరాశులలో మానవ జన్మ ఒక్కటే ఉత్కృష్టమైనది. ఎందుకంటే విచక్షణా జ్ఞాని మానవుడుఒక్కడే. అందుకే మనిషి జన్మకు పునర్జన్మ లేకుండా చేసుకోవడానికి ఎంత కష్టాన్నైనా ఎదుర్కొనడానికి మొక్కలోని విశ్వాసము అవసరము. సముద్రములో అలలెంత సహజమే ప్రతి మనిషి జీవితంలో కష్టాలు కూడా అంతే. సకారాత్మక భావనలు, కష్టాలను సవాళ్ళుగా స్వీకరించి విజయ కుసుమాలను సొంతం చేసుకుంటాము. చావు పుట్టుకలను బ్రహ్మ వ్రాస్తే భూమ్మీద మానవుని జీవితాన్ని మానవుడు వ్రాసుకుంటాడు. మనం చేసే ప్రతి పని ఆలోచనలను పట్టి ఉంటుంది. ఆలోచనలు అవసరాన్ని బట్టి మొదలవుతాయి. "Necessity is the Mother of Invention" అని అన్నారు. అంటే అవసరం మనిషిని కొత్త విషయాన్ని కనుక్కొవడానికి స్పూర్తిని, ప్రేరణను ఇస్తుంది. రోజంటే రాత్రి,పగలు. సముద్రమంటే అలలు, ఉపద్రవాలు. జీవితమంటే విజయాలు, అపజయాలు. మనిషి జీవితం నీటి బుడగ ఎప్పుడైన చితికి పోవచ్చు. ఈ జన్మకు కారణాన్ని వెతికితే తెలుస్తుంది. "ఇదం శరీరం పరోపకారమని". అపుడు మనిషి తన శరీరము మానవసేవ కోసము అని భావిస్తే తన జన్మ తరిస్తుంది. చెట్లు ఫలాన్ని ఇవ్వాలంటే విత్తునాటి, నీరుపోసి, రక్షించి దాని పోషణ బాధ్యతాయుతంగా స్వీకరిస్తే ఫలం తప్పక కాస్తుంది. విశ్వాసాన్ని మదినిండా నింపుకొన్నపుడే ప్రతి మనిషి తను చేసే ప్రతి పనిలో గమ్యం వైపు దూసుకెళ్ళి విజయాన్ని సొంతం చేసుకొంటారు. ఈ దైవ సృష్టిలో దైవం నేర్పేవి కొన్ని , మనము నేర్చుకోవలసినవి ఎన్నో. విశ్వాసమనేది అంతరంగికమైన అబేధ్యశక్తి. ఆశక్తి ఎపుడూ ఓటమని అంగీకరించదు. విశ్వాసము ప్రతి మనిషిలో క్రమ శిక్షణ అంకిత భావాన్ని, దృడ సంకల్పాన్ని పెంచి విజయం వైపు దూసుకెళ్తుంది.

దేహము దేవాలయమని, జీవుడు దేవుడని తెలుసు. ఉపనిషత్తులు, వేదాలసారము ఇదేనని తెలుసు. దేవాలయాన్ని పవిత్రంగా చూస్తాం. మరి మన శరీరం పవిత్రంగా చూడడానికి "ఇదం శరీరం పరోపకారమని" భావిస్తున్నామా! ఉదా : మన ఆరోగ్యం బాగుగా ఉన్నపుడు ఆలోచనలు ఆరోగ్యంగా ఉంటాయి కదా! . మన ఆరోగ్యం మన చేతులోనని తెలుసుకొని రుచికి ప్రాధాన్యత నిచ్చి అంటే నాలుకను అదుపులో ఉంచుకొనలేక కొత్త కొత్త రుగ్మతలను తెచ్చుకొని ఆరోగ్యాన్ని క్షీణింపచేసుకొంటున్నాం. జిహ్వను నీవు అదుపులో ఉంచుకోగలిగితే మనిషి ఆయువు వంద సంవత్సరాలు పైబడి జీవించవచ్చు, నన్ను సత్యాన్ని ఋజువు చేసుకోవచ్చు. పతంజలి మహర్షి బోధించిన అష్టాంగ యోగాన్ని క్రమము తప్పకుండా ఆచరిస్తే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యాన్ని పొందడం అనేది తథ్యం. ఎందుకంటే పతంజలి మహర్షి వారు శరీరానికి సంబంధించిన ఆసనాలు, ప్రాణాయామాలు మనసుని అదుపులో ఉంచుకొని ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకొని వెళ్ళే ధ్యానం గురించి చెప్పడం జరిగింది. కాబట్టి పతంజలి మహర్షి యోగాపై విశ్వాసముంచితే ఆరోగ్యపు నిధిని కలిగి మదినిండా ఆధ్యాత్మికపు కుసుమాల పరిమళాన్ని నింపుకోగలము. అపుడే కదా మానవ జన్మకు సార్థకత చేకూరేది. జాలరి నడి సముద్రంలో అనుకోని ఉపద్రవం మధ్య చిక్కుకొన్నపుడు కూడ విశ్వాసాన్ని విడనాడడు. వెనుకంజ వేయడు. గమ్యం కోసం ప్రయత్నిస్తాడు. మొక్కలోని విశ్వాసము ఆ జాలరిని తప్పక ఒడ్డుకు చేరుస్తుంది. విధి కోరల్లో చిక్కిన ఆ జాలరి విశ్వాసములో ఆ దైవాన్ని మెప్పించి, ఆ దైవం వ్రాసిన విదిని కూడా మార్చుకోగలడు. ప్రయత్నం విరమించని వాడు ఎపుడు కూడా అజేయుడే. జీవన సమరంలో మనిషి ఎపుడు కూడ యోధుడు కావాలి. పట్టుసడలని పోరాటము ఇక్కడ ఉదహరిస్తున్న జీవితాలు ఏ విధంగా విశ్వాసములో విధిని ఎదురించాయో తెలుసుకొందాం.

గొప్పవారి చరిత్రలను గమనిస్తే విశ్వాసమే ఊపిరిగా తలంచి తలవంపులులేని ఆలోచనలతో గమ్యంవైపు దూసుకెళ్ళినట్లు తెలుస్తున్నది కదా ఆదర్శాన్ని అమలు చేయడానికి తనపై తనకు విశ్వాసము కావాలి. ధర్మబద్ధమైన ఆశయాలు ఆదర్శాలుగా మారతాయి. ఆదర్శం నీతికి, నిజాయితికి కాణాచి. 1934 ఒలింపిక్ క్రీడలలో జెస్సీ ఓవెన్సీ నాలుగు బంగారు పతకాలను సాధించడానికి చేసిన కృషి వెనుక విశ్వాసము ఎంత గొప్పపాత్ర ఉందోకదా! వైద్యులు పరీక్ష చేసి ఇతని కాళ్లు పని చేయవు చలనము ఉండదు. జీవితాంతము Bed Ridden గా ఉండాలి. అని నిర్ధారించినపుడు తన మొక్కవోని విశ్వాసము తనకు నాలుగు బంగారు పతకాలు గెలిచేటట్లు చేసింది. నేడు నోబెల్ బహుమతి పొందిన సత్యార్థి బాలల హక్కుల కోసము పోరాట పతిమ ఎంతో విశ్వాసముతో కూడుకొన్నది కదా! మదర్‌థెరిసా విశ్వాసము,ప్రపంచమంతా ఉన్న అభాగ్యులను, నిర్భాగ్యులను, అనాథలను, కుష్టురోగులను, ఆదుకొని వారికి అన్నీ తానైందని అనడం సమంజసము కదా! అమ్మలా ఆదరించింది. కనికరించింది. తన విశ్వాసముతో వారికి తమకు అండగా అమ్మ ఉందన్న అభిప్రాయాన్ని విశ్వాసాన్ని పెంచింది. నేడు సత్య నాదెళ్ళ విశ్వాసము తన పేరు సాఫ్ట్‌వేర్ రంగంలో వెలిగిపోవడానికి తనపై తనకున్న విశ్వాసము కదా! బిల్‌గేట్స్, అనిల్ అంబానీల జీవితాలు ఆదర్శాలుగా తీసుకుంటే, వారి జీవిత గమ్యాన్ని గమనిస్తే వారు తలంచిన పనులుపై ఎంతో విశ్వాశాన్ని ప్రకటించారు. కాబట్టి వ్యాపార, వాణిజ్య రంగాలలో మొదటి స్థానాన్ని ఆక్రమించారు. నాటి మానవ ఆదిమజాతి, నేటి ఆధునిక జాతిని గమనిస్తే

ఈ రోజు గమనిస్తే ఊహకు అందని అభివృద్ధి మనిషి తనపై తనకు నమ్మకము, విశ్వాసమే కదా! వండడమే తెలియని మానవుడు నేడు వండించి సంవత్సరాల తరువాత తినడానికి సరి చేసుకొంటున్నాడు కదా! విశ్వాసముతో భూమిమీద విలాసవంతమైన జీవితాన్ని సొంతం చేసుకొన్నాడు. గగనంలో దేవతల్లాగ విహరిస్తున్నాడు. చేపలా మారి సముద్రపు లోతును కనుగొని సముద్రపు నిధిని సొంతం చేసుకొంటున్నాడు. విశ్వాసముంటే విజేతలం. విశ్వాసము లేకపోతే పరాజితులం. మనపైన మనకున్న విశ్వాసము మనలను ముందుకునడుపుతుంది. అందుకే స్వామి వివేకానందుడు 'నీ విధికి నీవే శిల్పివి' అన్నారు. ఆంగ్లములో Look before you leap అంటే ఆలోచించి నిర్ణయము తీసుకొమ్మనికదా! మంచి ఆలోచనతో నిర్ణయము ఎపుడు మంచిగాను ఉంటుంది. అమ్మ అన్నం వండేటప్పుడు బియ్యమును గాలించి రాళ్ళను ఏరేసి అన్నం వండుతుంది. అందుకు అమ్మ వంటకు పేరెట్టలేము. అదేవిధంగా ఆలోచనకు విశ్లేషణ జోడించి నిర్ణయం తీసుకొంటే ఫలితం అద్భుతమైన విజయం. సకారాత్మకత ఎపుడు వినూత్నమైన ఆలోచనలను విశ్లేషించి విశ్వాసముతో విశిష్టమైన నిర్ణయాలతో విజయాలతో విజయాన్ని సొంతం చేసుకొంటుదనేది సత్యం.

స్వామి వివేకానందుని విశ్వాసము శ్రీరామకృష్ణ పరమహంస శిష్యరికంలో భగవంతుని ప్రత్యక్షముగా తన దివ్యనేత్రంతో చూడలేదా! ప్రేమే ఆయుధంగా సత్యసాయి బాబా తనపై విశ్వాసము ఉంచిన భక్తులకు సకల భోగాలను ప్రసాదించలేదా! విశ్వాసముతో ప్రపంచ భక్తలందురు షిర్డి సాయిబాబాను శ్రద్ధ, శబూరిలో ప్రార్థనలు జరుపుతూ షిర్డిని రెండవ తిరుమలగా గమనిస్తున్నాము కదా! మానవునికి సుఖవంతమైన జీవితం, విశ్వాసము మీదే ఆధారపడి ఉంటుంది. విశ్వాసములోనే మనిషికి ఆశలు చిగురిస్తాయి. వసంత ఋతువులో మావిడితోపు చిగుర్లలో ప్రకృతి రమణీయంగా ఉన్నట్లు మానవుని జీవితముగూడా ఆనందమనే చిగుర్లలో చిగురిస్తుంది. ఇంటా, బయటా ఎక్కడైనాసరే విశ్వాసము కలిగి ఉన్నపుడు మాత్రమే మనిషి ప్రశాంతముగాను, ఆనందముగాను ఉండగలడు. మనిషి నుంచి అనుమానాన్ని తొలగించేది విశ్వాసమే! ''అనుమానము పెనుభూతము! విశ్వాసము అమృతమయం'' అనుమానంతో అవమానాలు, విశ్వాసముతో విజయాలు. అనుమానము సంకుచితముగా ఆలోచిస్తుంది. విశ్వాసములో విమానంలో వినీల ఆకాశంలో విహరిస్తున్నాము. అనుమానంతో అందమైన జీవితాలను నాశనము చేసుకొంటున్నాము. మదిలోని ఆలోచనలు విధిని నిర్ణయిస్తాయి. నీటి బిందువు నిప్పుమీద పడితే ఆవిరి అయిపోతుంది. అదే నీటి బిందువు సముద్రంలో పడితే సముద్రపు నీటిలో తానెంత అన్నట్లు కలిసిపోతుంది. అదే నీటి బిందువు తామరాకుపై పడితే ముత్యంలా మెరుస్తుంది. అదే నీటి చుక్క ముత్యపు చిప్పలో పడితే ముత్యముగా మారుతుంది. మన భవిష్యత్తుకు మనమే కర్తలం. మనం తీసుకొనే నిర్ణయాలు మంచివైనపుడు మహాత్ములం కాలేమా! బుద్ధుని బుద్ధత్వం, జైన మహావీరుని జైనత్యం ప్లాటో, సోక్రటీస్ గ్రీకు తత్వం, వివేకానందుని యువతత్వం, రమణ మహర్షి, అరవిందుల ఆత్మతత్వం, సత్యసాయి, మదర్‌థెరిస్సా ప్రేమతత్వం, షిర్డిసాయి సర్వమత సమానతత్వం, గురునానక్ గురుతత్వం, మహమ్మద్ ప్రవక్త సోదరతత్వం, క్రీస్తు క్షమాతత్వం, ఆది శంకరాచార్యులవారి అద్వైతం... ఇవన్నీ వారి వారి ఆలోచనల విశ్లేషణ తర్వాత విశ్వాసాన్ని ప్రకటించి లోకకళ్యాణము కొనము వీరు ఈ మాయా ప్రపంచాన్ని అందించిన వేదాలే కదా! ▯




(గత సంచిక తరువాయి)

"దేవేంద్రా! యజ్ఞభాగం చేపట్టేవారిలో నిన్నే మొదటి వానిగా పెద్దలు చెబుతారు. అలాంటి నీవే యజ్ఞదీక్షితుడైన మా తండ్రియజ్ఞం చెడగొట్టడానికెలా పూనుకొన్నావు ? త్రిలోకాధిపతివైన నీవు యజ్ఞద్రోహులను దివ్యదృష్టితో కనిపెట్టి దండింపవలసిన వాడవు కదా! అట్టి నీవే ధర్మకర్మలకు అంతరాయం కలిగించబూనుకొంటే ఇక సత్కార్యాలన్నీ అంతరించినట్లే. మఘవన్! అశ్వమేధానికి ముఖ్యసాధనమైన మా గుఱ్ఱాన్ని మాకు వదిలిపెట్టడం న్యాయం. ఇతరులకు మంచి నడవడి చూపించవలసిన పెద్దలు స్వయంగా చెడుత్రోవను అవలంబింపరు సుమా!"

ఇలా ప్రగల్భంగా పలికిన రఘువు మాట విని ఆశ్చర్యపడి దేవేంద్రుడు రథం మళ్ళించి అతనికిలా సమాధానం చెప్పాడు.

"రాజకుమారా! నీవు చెప్పినమాట నిజమే. అయినా కీర్తిమంతులు ఇతరులవల్ల తమ కీర్తికి హాని లేకుండా చూచుకోవాలి. జగత్ప్రసిద్ధమైన నాయశస్సును ఈ యాగంతో అపహరించటానికి మీ తండ్రి పూనుకొన్నాడు. విష్ణువు కొక్కడికి పురుషోత్తముడని ప్రసిద్ధి. త్రిలోచనుడికి మాత్రమే మహేశ్వరుడని పేరుగాని మరొకరికి లేదు. అలాగే మునీంద్రులు నన్నొక్కణ్ణే "శతాశ్వమేధకర్త" అంటున్నారు. ఈ పేరు ఇంకొకరికి రావటానికి వీలులేదు. అందువల్ల నేనీ గుఱ్ఱాన్ని అపహరించాను. దీని జోలికి నీవు రావద్దు. వచ్చావంటే పూర్వం కపిలమహామునివల్ల సగరుని కొడుకులకు పట్టినగతే నీకూ పడ్తుంది.

ఆ మాటకు రఘువు నవ్వి నిర్భయంగా మళ్ళీ ఇలా అన్నాడు -

"దేవేంద్రా! ఇదే నీ నిశ్చయమైతే శస్త్రం చేతికి తీసుకో. రఘువును జయించకుండా నీవు కృతకృత్యుడవుకాలేవు సుమా!"

మొగమెత్తి అలా ఇంద్రునితో పలికి రాజకుమారుడు వింట బాణం సంధించడానికై కుడికాలు ముందుబెట్టి ఎడమకాలు కుంచించుకొని శరీరౌన్నత్యంతో పరమేశ్వరుణ్ణి అనుకరిస్తూ నిలబడ్డాడు.

అతడు పలికిన తిరస్కారవచనం బాణంలా వచ్చి ఇంద్రుని గుండెల్లో గ్రుచ్చుకొన్నది. స్వర్గాధిపతి మిక్కిలి రోషించి క్రొత్త మబ్బులకు క్షణకాలం అలంకారమైన తన వింట అమోఘమైన శరం సంధించాడు. రక్కసుల నెత్తురు త్రావటాని కలవాటుపడ్డ ఆ బాణం దిలీపకుమారుని వక్షఃస్థలం ప్రవేశించి మునుపెన్నడూ తాను చవిచూడని మానవరక్తం ఎలా ఉంటుందో చూడాలన్న కోరికతో గాబోలు, అతడి రక్తం త్రాగింది. ఐరావతాన్ని తాటించడంవల్ల బిరుసెక్కిన వ్రేళ్లు గల్గి, శచీదేవికి పత్రవిశేషకాలురచించటాని కలవాటుపడిన మహేంద్రుని భుజం మీద పరాక్రమంలో కుమారస్వామికి ధీటైన రఘువుకూడా తన పేరు చెక్కిన బాణం నాటాడు. వెంటనే నెమలి రెక్కలు గట్టిన మరొక వాడిశరం ప్రయోగించి దేవేంద్రుని పిడుగుటెక్కెం విరగగొట్టాడు. టెక్కెం విరగడం తన రాజ్యలక్ష్మికి తలవెండ్రుకలు గొరగడంగా భావించి సురలోకాధిపతి కోపంతో మండిపడ్డాడు.

అలా జయాభిలాషతో పోరాటానికి సిద్ధమైన వారిరువురికీ సంకుల సమరం జరిగింది. ☐

# శ్రీ కృష్ణ భక్తాగ్రగణ్యుడు శ్రీ చైతన్య మహాప్రభువు

....ములుకుట్ల సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, ఒంగోలు

భగవంతుడు ప్రేమమయుడు. భగవద్భక్తులు ప్రేమాశ్రితులు. భగవంతునిపట్ల పరమప్రేమయే భక్తి' అని నారద మహర్షి భక్తి సూత్రాలలో స్పష్టం చేశారు. భగవానునికి భక్తులపై ఉండే ప్రేమ, తన భార్య మహాలక్ష్మిపై జీవితం సఫలం చేసుకొన్న ధన్యజీవి శ్రీ చైతన్య మహాప్రభువువారు.

వంగదేశంలోని నవద్వీపంలో జగన్నాథమిశ్ర, శచీదేవి పుణ్యదంపతులకు 10వ బిడ్డగా శ్రీచైతన్యుల వారు జన్మించారు. మంచి వర్చస్సుతో అందంగా ఉన్న కారణంగా బాలునికి 'గౌరాంగ' అని నామకరణం చేశారు. వేపచెట్టు క్రింద బాలుని ప్రసవించిన కారణంగా 'నిమాయ్' అని తల్లి ముద్దుగా పిలిచేది. తండ్రి కుమారుని 'విశ్వంభర' అని ప్రేమగా పిలిచేవాడు. ఈ విశ్వంభరుడే తర్వాత కాలంలో చైతన్యప్రభువు అయ్యెను.

'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది' అన్నట్లు బాల్యంలోనే శ్రీ చైతన్యునిలో ఎన్నో ఆధ్యాత్మిక అద్భుతాలు కనిపించేవి. అన్నప్రాసన సందర్భంలో బాలుని ఎదుట బంగారుహారం, ధనం, పండ్లు, మధురపదార్థాలు ఎన్ని ఉన్నా శ్రీమద్భాగవత గ్రంథాన్ని పట్టుకొని భావికాలంలో తన లక్ష్యమేమిటో ప్రకటించాడు. బాలచైతన్యుడు ఏడుస్తూ ఉన్నప్పుడు - హరనామ సంకీర్తనం చేస్తే నవ్వేవాడు. 5 సంవత్సరాల వయసులోనే ఎన్నో ఆధ్యాత్మిక విషయాల గూర్చి తల్లితో చర్చించేవాడు.

ఒకసారి ఇంటికి వచ్చిన సాధువు భోజనం చేయబోతూ ఒక ఆకులో శ్రీకృష్ణుని కని మొదటి ముద్ద ఉంచగా శ్రీ చైతన్యుడు ఆ ముద్దను స్వీకరించి తనకూ కృష్ణునికీ తేడా లేదనే అనుభూతిని సన్యాసికి కల్గించెను. బాలచైతన్యుడి నగలను అపహరించాలని దొంగలు అతనిని ఎత్తుకొని పోతుండగా మోయలేని బరువుగా మారడంతో ఏమీ చేయలేక వదిలివెళ్లారు.

చైతన్యులవారు తల్లియైన శచీదేవి పాదాలపైబడి ఏకాదశి తిథి రోజు భోజనం చేయవద్దని ప్రార్థించెను.

గంగాదాస పండితుని వద్ద వ్యాకరణం, తర్కం అధ్యయనం చేసెను. స్ఫురద్రూపి. ఏకసంథాగ్రహి. చైతన్యుని ప్రతిభను చూసి పండితులు ఆశ్చర్యపోయేవారు.

19వ ఏట విద్యాభ్యాసం పూర్తి చేసుకొని ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. న్యాయ, అలంకార శాస్త్రాలలో అసాధారణ పాండిత్యం కల గదాధరుని, ముకుందుని ఓడించడంతో నవ ద్వీపంలోని పండితులందరు శ్రీ చైతన్యులవారిని 'అసమాన ప్రజ్ఞాదురంధరులని' కీర్తించారు.

సుగుణశీలి, విద్యావినయ సంపన్నురాలైన లక్ష్మీదేవితో శ్రీచైతన్యులవారి వివాహం జరిగింది.

కాశ్మీర పండితుడైన కేశవభట్టు నవద్వీపానికి వచ్చి నాతో వాదించుటకు సమర్థులెవరని ప్రశ్నిస్తే శ్రీచైతన్యులు ముందుకువచ్చి కేశవభట్టు రచించిన గంగాస్తవముతో 5 తప్పులు చూపించి, వాదించి, ఓడించెను.

పాదాలపైబడి కేశవభట్టుతో - మనకున్న

పాండిత్యం ద్వారా భగవంతుని సేవించుట లక్ష్యం కావాలి. గర్వం వదలి, గోవిందుని సేవింపుమని కర్తవ్యబోధ చేసెను.

భార్య పాముకాటుతో మరణించగా సనాతన మిశ్రగారి కుమార్తె అయిన విష్ణుప్రియాదేవితో ద్వితీయ వివాహం జరిగెను.

తీర్థయాత్రలలో భాగంగా గయాక్షేత్రం చేరి సాధు ఈశ్వరపురివద్ద దశాక్షర గోపాల మంత్రం స్వీకరించెను. శ్రీచైతన్యులకు విశ్వమంతా కృష్ణమయంగా కనిపించెను.

నిరంతరం కృష్ణ నామస్మరణ చేస్తూ ఒక్కొక్కసారి నాట్యం చేసేవాడు. భజన చేస్తూ కృష్ణవిరహంతో ఏడ్చేవాడు. క్రిందపడి దొర్లుతూ కృష్ణా! ఎక్కడికి వెళ్లావు? ఎక్కడున్నావు ? నీవు లేకుండా నేను ఉండలేను అంటూ..

**అయి నంద తనుజ కింకర పతిత మాం విషయే భావాంబధౌ**
**కృపయా తవ పాదపంకజ స్థిత ధూళీ విచస్తయ ......**

హే నందనందనా ! నేను నీ దాసుడను. నీకు బానిసను. ఈ సంసారసాగరంలో మునిగిపోతున్న నాకు నీ పాదపద్మాల చెంత కొంచెం చోటు ఇవ్వు తండ్రీ!... అంటూ భక్తిపారవశ్యమును పొందేవాడు.

**యుగాయితం నిమేషేణ చక్షుషాప్రావృషాయితమ్ః**
**శూన్యాయితం జగత్ సర్వం గోవింద విరహేణ మే...**

కృష్ణా! నీవు లేని ప్రతిక్షణం నాకు ఒక యుగంలాగా బాధిస్తున్నది. నా నేత్రాలు శ్రావణమేఘాలై వర్షిస్తున్నాయి. ఈ ప్రపంచమంతా నాకు ఎడారిలాగా కనిపిస్తున్నది. గోవిందా! నన్ను రక్షించు అని పరితపించేవాడు.

శ్రీకృష్ణనామ మహత్యాన్ని ప్రచారం చేస్తూ నవద్వీపం చేరాడు.

శ్రీ చైతన్యులవారి దివ్యపారవశ్య భక్తి తన్మయ తనుచూచి ఎందరో ఆయన భక్తి ఉద్యమంలో చేరారు. వారిలో శ్రీ అద్వైతాచారి, శ్రీనిత్యానంద ప్రభ, శ్రీహరిదాసు, రూప సనాతన సోదరులు ముఖ్యులు.

నవద్వీపమును పాలించే కాజీలో మానసిక పరివర్తనను తెచ్చి శ్రీకృష్ణభక్తునిగా చేసారు.

సన్యాసదీక్ష స్వీకరించి శ్రీచైతన్య నామంతో భక్తి ప్రచారం చేస్తూ పూరీక్షేత్రం చేరెను. జగన్నాథస్వామి ఆలయశిఖరమును చూస్తూ 8 గంటలసేపు భావసమాధిలో నిలిచిపోయెను.

సమాధి నుండి బైటకు రాగానే 'జగన్నాథా! శ్రీకృష్ణా! రాధేశా! అంటూ ఆనందంతో గంతులు వేసారు.

తీవ్రసాధనతో శ్రీకృష్ణ భగవానుని దివ్యసాక్షాత్కారము పొంది, భక్తి ఉద్యమం ద్వారా ధర్మప్రచారం చేసి శ్రీకృష్ణస్వామిలో లీనమయ్యారు.

- చిల్లికుండలోని నీటి మాదిరి నవరంధ్రాల ఈ కుండ నుండి ఆయుస్సు నిరంతరం తరిగిపోతూనే ఉంది. కారుతున్న కుండను పూలపాదులోనో లేక ఉపయోగమున్న చోటనే ఉంచాలి. కాని బురద గుంట వద్ద ఉంచితే ప్రయోజనం ఉంటుందా! అలాగే దేహమనే ఈ మట్టికుండను కూడా భగవంతుని సన్నిధిలోనో, పరోపకారపు పాదులోనో ఉంచితే ప్రయోజనం కాని విషయాలలో ముంచితే ఉపయోగం లేదు.

- సంకల్పాలతో కూడిన మనస్సు గాలిలో పెట్టిన దీపం లాంటిది. అది స్థిరంగా ఉండదు. ఈ దేహం నుండి దూరంగా పారిపోవడానికే ప్రయత్నిస్తుంది. దానికి తపస్సు అనే అడ్డుగోడను కడితే తప్ప మన అధీనంలో ఉండదు.

గీతా సుధ

# భగవద్గీతకు భాసుర భాష్యం



డా॥ రాధశ్రీ, కర్నూలు, ఫోన్: 9494481210

(గత సంచిక తరువాయి)

ప్రజాబాహుళ్యం అందించే ప్రేమాభిమానాల రంగుల్లో కుంచెను ముంచి భగవద్గీతకు ఆధునికంగా భాసురభాష్యాన్ని చెబుతున్నాడీ భాష్యకారుడు రాదశ్రీ. పది అధ్యాయాలను దిగ్విజయంగా పూర్తి చేసుకొని మహా మహిమోన్నతమైన పదకొండవ అధ్యాయంలో ప్రవేశిస్తున్నాం మనం. దీనిని విశ్వరూప సందర్శన యోగం అంటాం. అర్జునుడు విశ్వరూపాన్ని చూడాలని అనుకోవడం, కృష్ణుణ్ణి అడగడంతో ఈ పదకొండవ అధ్యాయం మొదలు అవుతుంది.

ఓ కృష్ణా నీవు నా మీద దయతో నాకు చెప్పిన వివిధ మైన విషయాలను విన్న తర్వాత నామోహం తొలగిపోయింది. నీవు చెప్పినట్లు నీవు మూర్తీ భూత "కర్మ" వే! అంటే మనిషి అవతారం దాల్చిన "పని" వేనని ఒప్పుకుంటున్నాను. 'పని' మాత్రమే శాశ్వతం అని నేనూ ఒప్పుకుంటున్నాను.

**మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మ సంజ్ఞితమ్।**
**యత్త్వయోక్తం వచస్తేన మోహోఽయం విగతో మమ (11-01)**

నీవు చెప్పినందు వలన జననం గురించి మరణం గురించి నీ (పని) మహత్మ్యం గురించి విపులంగా అవగాహన వచ్చింది.

**భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా।**
**త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్ (11-02)**

ఈ శ్లోకంలో అర్జునుణ్ణి కృష్ణుడు కమల పత్రాల వంటి విప్పారిన పెద్దవైన నేత్రాలు గలవాడా అని సంబోధించాడు. పెద్దకళ్లు అందాన్ని అధికం చేయడమే కాక విశాల దృక్పథానికి కూడా సంకేతంగా నిలుస్తాయి అని గీతాచార్యుని భావన! "తామరాకు మీద నీటి బొట్టు" అనే జాతీయాన్ని మనం అందరం విన్నాం. తామరాకు మీద నీటి బొట్టుపడితే, ఆ నీటి బొట్టు తామరాకుకు తాకదు. అలా అని దానికి దూరంగా పోదు.

ఒక రకమైన "సంబంధ రహిత సంబంధా"నికి తామరాకు ప్రతీక ఈ లోకంలోనే ఉంటుంటాం కానీ లౌకిక విషయాలైన వాటిమీద, క్షుద్ర విషయాలైన వాటి మీద దృష్టి పెట్టం.

పైన చెప్పినట్లు తామరాకు మీద ఉన్నా ఆ నీటి బొట్టు తామరాకుతో ఎటువంటి సంబంధమూ కలిగి ఉండదు. "కమల పత్రాక్షా" అనడంతో నాకు కూడా ఈ "సంబంధరహిత సంబంధం" అవగతమైంది బావా అని అర్జునుడు కృష్ణునికి ప్రతీకాత్మకంగా తెలియ జేస్తున్నాడన్న మాట! ఇది ఈ నాటికీ ముమ్మాటికీ కరెక్టే. ఉదాహరణకు మనం ఒంగోలు నుండి నెల్లూరుకు బస్సులో వెళుతున్నాం అనుకోండి. ఒంగోలులో బస్సు ఎక్కిన దగ్గర నుండి నెల్లూరులో బస్సు దిగేవరకూ మనం బస్సులోనే ఉంటాం. బస్సుతోనే ఉంటాం! వచ్చేటప్పుడు "సీటు" తీసుకొనిరాము. బస్సు దిగిన తర్వాత "సీటు" తీసుకొనిపోము. ఒంగోలు నుండి

నెల్లూరు వరకూ బస్సుతోనే ఉన్నా ఆ బస్సు మీదగానీ, బస్సులోని సీటు మీద కానీ వ్యామోహం పెంచుకోము. నెల్లూరు చేరిన తరువాత అంతవరకూ మనం కూర్చున్న సీటునూ వదిలి పెట్టి వెళ్లిపోతాము. ఒక వేళ నిలబడే నెల్లూరు (గమ్యం) చేరితే, ఆ తర్వాత "సీట్లున్నాయి రండి బాబూ" అని బ్రతిమిలాడినా బస్సులో ఎక్కం. కాని ఒంగోలులో బస్సు ఎక్కిన దగ్గర నుండీ నెల్లూరులో బస్సు దిగే వరకు "బస్సుకు ఏ సమస్యారాకూడదు" అని కోరుకుంటాం! నెల్లూరులో (గమ్యంలో) దిగిన తర్వాత సీటు నంబరుగానీ, సర్వీసు నెంబరుగానీ, ఆఖరుకు తాటికాయంత అక్షరాలతో ఉండే బస్సు నెంబరుగానీ గుర్తుకు రాదు. ఇదే "డిటాచ్డ్ ఎటాచ్మెంట్" అంటే! బస్సుకైనా, తామరాకుకైనా, రైలుకైనా, విమానానికైనా ఇదే వర్తిస్తుంది. అంత డిటాచ్డ్ ఎటాచ్మెంటును కళ్లల్లో నింపుకున్న ఓ శ్రీకృష్ణా అని అర్జునుడు కృష్ణుణ్ణి సంబోధించాడంటే, ఈ "సంబంధ రహిత సంబంధాన్ని" అర్థం చేసుకున్నాను అని చెప్పినట్లే.

అయితే కృష్ణా (పని రూపమైన ఓ వ్యక్తీ) నీవు నాకు కనిపిస్తున్నావు. కాని ఈ భౌతిక జగత్తంతా నీవే ఉన్నావన్నావు కదా మరి ఆ రూపాన్ని ఎలా చూడాలి? నీవు నాకు అణువణువునా ఉన్నట్లు నాలాంటి (సామాన్యుడు) ఎలా తెలుసుకోవాలి ? నాకు ఆ రూపాన్ని చూపించు. చూడాలని అనుకుంటున్నాను అన్నాడు.

**ఏవమేతద్యథాత్థ త్వమ్ ఆత్మానం పరమేశ్వర।**
**ద్రష్టుమిచ్ఛామి తే రూపమ్ ఐశ్వరం పురుషోత్తమ ॥ (11-03)**

అసలు నేను అలాంటి రూపాన్ని చూడగలనా ? చూచేశక్తి నాకున్నదని నీవు అనుకుంటే నాకు చూపించు.

**మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో।**
**యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మానమవ్యయమ్ (11-04)**

గీతాచారుడు వ్రాసిన ఈ శ్లోకం చాలా ప్రాముఖ్యం వహిస్తుంది. పాత్ర దానానికీ, ఆ పాత్ర దానానికీ మధ్య గల వ్యత్యాసాన్ని ఈ శ్లోకం మనకు తెలియజేస్తున్నది.

ఒక రోగికి ఆపరేషన్ చేయాల్సి వచ్చిందనుకోండి! ఆయనకు 'షుగర్' కంట్రోలులో లేదనుకోండి! అయినా డాక్టరు ఆపరేషన్ చేస్తాడా? చేయడుగాక చేయడు. ముందుగా షుగరును కంట్రోలు లోనికి తెచ్చి, ఆ తరువాతనే ఆపరేషన్ చేస్తాడు. అలాగే ముందు మనిషిని మానసికంగా సిద్ధం చేయాలి, భౌతికంగా సిద్ధం చేయాలి. అప్పుడే ఆయా వ్యక్తులతో ఆయా పనులు చేయించడం సాధ్యమవుతుంది. కాబట్టి ఆపరేషను చేయాలంటే బీపీని, షుగరును కంట్రోలు లోకి తెచ్చిన తర్వాతే చేయాలి. ఇక్కడ ఒక విషయం చర్చిద్దాం.

ఒకానొక గ్రామంలో ఒక ధాన్యపు బస్తాల గిడ్డంగి ఉన్నది. యజమానికి ఆ గిడ్డంగి మీద ఎంతో మమకారం ఉండేది. ఆ గిడ్డంగిలోకి ఎలా వచ్చాయోగాని నాలుగైదు ఎలుకలు వచ్చి, అటు ఇటు తిరుగుతూ ధాన్యపు బస్తాలకు రంధ్రాలు చేసి, కొరికి, కాళ్లకు అడ్డం పడుతూ ఉండేవి. కాలక్రమంలో అవి పిల్లల్ని కూడా పెట్టి మరింత విజృంభిస్తున్నాయి ఆ యజమాని వీటి ఆగడాలు భరించలేక, ఆలోచించి ఆలోచించి ఒక పిల్లిని గిడ్డంగిలోకి వదిలాడు. అప్పటి వరకు ఆ గిడ్డంగిని యధేచ్ఛగా, సర్వ స్వతంత్రంగా పాలించిన ఎలుకలకు ఇప్పుడు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయినది. ఇప్పుడు ఎలుకలు బయటకి రావడానికి కూడా భయపడుతున్నాయి. వాటికి ఏమి చేయాలో పాలు పోవడంలేదు. ఆకలికి

అల్లాడిపోతున్నాయి. అవన్నీ కలసి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఎంతో చర్చించాయి. ఒక నిర్ణయానికి రాలేకపోయాయి. ఒక కుర్ర ఎలుక వచ్చి "ఆ పిల్లి మెడలో గంటకడితే సరిపోతుంది. ఆ పిల్లి ఎప్పుడైనా మన వైపు వస్తే మనకు శబ్దంవస్తుంది. మనం అప్రమత్తులం కావచ్చు'' అన్నది కొన్ని ఎలుకలకు అది బాగా నచ్చింది. కాని అందులో అనుభవం ఉన్న వృద్ధ ఎలుకలు మాత్రం పిల్లి మెడలో గంట కట్టడం అసాధ్యం'' అని నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చాయి.

ఇలా ఎంతగా చర్చించినా ఒక నిశ్చితాభిప్రాయానికి రాలేకపోయి "మనం అందరం ఇక్కడికి దగ్గరలో ఉన్న ఒక మునీంద్రుణ్ణి అడుగుదాం. ఆయన ఏమి చెపితే అది మనం అందరం పాటిద్దాం'' అనే అభిప్రాయం అందిరి మద్దతుతో అంగీకరించాయి. వెంటనే ఒకటి రెండు ఎలుకలు ఎలాగో పిల్లి కంటబడకుండా మెల్లిగా వెళ్లి మునీంద్రునికి నమస్కారంచేసి తమ గోడువెళ్లబోసుకొని తమకు ఏదైన సలహా ఇవ్వమని ప్రార్థించాయి. ఆ మునీంద్రుడు బాగా ఆలోచించి ఒక పత్రం మీద తన సలహాను వ్రాసి "దీనిని రహస్యంగా తీసుకొని మీ సమావేశంలో అందరి ముందర చర్చించి నేను చెప్పిన విధంగా - మళ్లీ చర్చించకుండా - ఆచరించండి'' అని ఆదేశించాడు. ఆ ఎలుకలు "అలాగే స్వామి'' అంటూ ఆ పత్రాన్ని మరో పెద్ద పత్రంలో చుట్టి, దాచి, మరలా ఎలుకల సమావేశం జరిపినప్పుడు ఆ పత్రాన్ని తెచ్చి చదివాయి. ఇంతకూ ఆ పత్రంలో ఆ ముని ఏమి వ్రాశాడు... ?? "పిల్లిని ఎదిరించాలంటే, మీరుకూడా పిల్లులై పోండి'' అని ఆ ముని వరుడు ఆ పత్రంలో వ్రాశాడు. అంటే... అంటే... ఒక సమస్యను ఎదిరించాలంటే... పరిష్కరించాలంటే... మనం కూడా మానసికంగా ఆ సమస్యకన్నా పెద్ద వాళ్లం కావాలన్నమాట.

మనిషి ఎదిగితే (మానసికంగా) సమస్య చిన్నదవుతుంది. మానసికంగా ఎదిగిన లాల్ బహదూర్ శాస్త్రి ముందర పాకిస్తాను చిన్నబోయింది. మానసికంగా బలాఢ్యుడు, భౌతికంగా బక్క పలచని గాంధీగారి ముందర ప్రపంచం మోకరిల్లింది.

అందుకే అర్జునుడు కూడా యుక్తియుక్తంగా నాకు చూచే శక్తి ఉంటే నీ విశ్వరూపాన్ని చూపించు'' అన్నాడు. అంటే "ఒక వేళ నాకు ఆ శక్తి లేకపోతే ముందు ఆ శక్తిని ఇవ్వు'' అనే ధ్వనికూడా అందులో ఉంది. ఇంతకు ముందు చెప్పుకున్నట్లు రోగి ఆపరేషనుకు యోగ్యుడు కానప్పుడు ముందు బీపీ, షుగరు తగ్గించి, కంట్రోలు చేసి - ముందు ఆపరేషనుకు అర్హున్నిచేసి - ఆ తర్వాత ఆపరేషన్ చేస్తారు. పిల్లితో పోరాడవలెనంటే ముందు ఎలుక కూడా పిల్లిగా మారాల్సిందే (మానసికంగా నైనా సరే). ఇదే అర్జునుడు కూడా కోరుకున్నాడు. ఒక గుమస్తాకు అధికారి పదవి ఇస్తే లేదా ఒక అధికారిని అంతకన్నా పెద్ద పదవిలో కూర్చోబెడితే ముందుగా దానికి తగిన శిక్షణ యిస్తారు. ఈ విశ్వసత్యాన్ని, ఈ నిత్యసత్యాన్ని ఈమంచి ముత్యాన్ని గీతాచార్యుడు ఎంత గొప్పగా చెప్పాడో చూడండి!

- వజ్రాన్ని చేతిలో ఉంచుకొని రంగురాళ్ల కోసం వెదుకుచున్న వాడి మాదిరి తనలో నున్న పరమాత్మను గుర్తించక మానవుడు దేశాల వెంట తిరుగుచున్నాడు.
- గురుభక్తిలేనివాడు, మాయకు లోనైనవాడు, తంత్రబుద్ధి కలవాడు, మాత్సర్యం కలవాడు, ఐశ్వర్యం అనే మత్తులో మునిగిన వాడు పరతత్వాన్ని తెలియజాలడు.

# అష్ట వినాయకులు

## 8. ధూమ్రవర్ణ

.... కీ.శే. డా॥ రోహిణి వెంకట సుందరవరదరాజేశ్వరి

**ధూమ్ర వర్ణావతారశ్చాభిమానా సురనాశకః।**
**ఆఖువాహన ఏవాసౌ శివాత్మాతు స ఉచ్యతే॥**

శ్రీగణేశ భగవానుని "ధూమ్రవర్ణ" నామావతారము అభిమానాసురుని నశింపజేయునది. శివబ్రహ్మస్వరూపమైనది. ఇతని వాహనము మూషికమే.

ఒకమారు లోక పితామహబ్రహ్మ సూర్యునకు కర్మాధ్యక్ష పదవినొసగెను. పదవి ప్రాప్తించగనే సూర్యదేవుని మనస్సునందు అహంకారము జనించెను. అదే సమయమున తుమ్మువచ్చెను. ఆ తుమ్ము నుండి అహంతాసురుడు జన్మించెను. ఇతడు దైత్య గురుశుక్రాచార్యుని వద్ద గణేశ మంత్రదీక్షను పొంది తపమునకై వనమునకు వెళ్ళెను. వనమందు అహంతాసురుడు ఉపవాస దీక్షతో గణేశ భగవానుని కొన్ని వేల సంవత్సరములు ఘోరముగ తపస్సు చేసెను.

అనంతరము గణేశ భగవానుడు ప్రత్యక్షమై "నీ కిష్టమగు వరము కోరుకొను"మనెను. అహంతాసురుడు "సమస్త బ్రహ్మాండ రాజ్యమును, అమరత్వమును, ఆరోగ్యమును, విజయమును వరముగా కోరు"కొనెను.

గణేశ భగవానుడు "తథాస్తు" యని అంతర్ధానమయ్యెను.

అహంతాసురుడు తిరిగి శుక్రాచార్యుని వద్దకు వచ్చి విషయము చెప్పగా అతడు సంతసించి సమస్త అసురులను పిలిపించి అహంతాసురుని అసురాధిపతిగా నియమించెను. ఈ సమయమున అసురులు ఉత్సవము గావించుకొనిరి. "విషయప్రియ" నామ నగరమందు అహంతాసురుడు సుఖముగ నివసించసాగెను.

ఇతడు సర్వాధిక యోగ్యుడని తలచిన ప్రమదాసురుడు తన పుత్రికనిచ్చి వివాహము చేసెను. కొంత కాలమునకు వీరికి "గర్వ", "శ్రేష్ఠ" నామములు గల ఇద్దరు పుత్రులు గలిగిరి.

ఒకనాడు అహంతాసురుడు, మామ సలహాను, గురువు ఆశీర్వాదమును పొంది విశ్వవిజయమునకు బయలుదేరెను. అసురులచే భయంకరముగ నరసంహారము జరుగుచుండెను. ఈ విధముగ సమరము జరుపుచూ సప్తద్వీపముతో పృధ్విని స్వాధీన పరచుకొనెను.

అనంతరము స్వర్గముపై దండెత్తెను. దేవతలు పరాజితులైరి. అహంతాసురుడు స్వర్గమునకు శాసకుడయ్యెను. దేవతలు, ఋషులు పర్వత గుహలందు ప్రవేశించిరి. ధర్మము నశించెను. దేవ, దానవ, నాగకన్యలను అహంతాసురుడు అపహరించి భంగపరుచుచుండెను.

బ్రహ్మ, మహేశ్వరుల ప్రేరణతో దేవతలు గణేశ భగవానుని ఆరాధించసాగిరి. ఏడు వందల సంవత్సరములు ఉపాసించగా గణేశ భగవానుడు దేవతల మొరనాలకించి వారి కష్టములను తొలగించెదనని మాట ఇచ్చెను.

మొదట నారదుని అహంతాసురుని చెంతకు

దూతగా పంపెను. ధూమ్ర వర్ణ గణేశుని శరణువేడి ప్రశాంతముగ జీవితము గడుపుమని సందేశము పంపెను. అహంతాసురుడు కోపోద్రిక్తుడయ్యెను. సందేశము నిష్ఫలమయ్యెను. నారదుడు నిరాశతో తిరిగివచ్చెను.

ధూమ్ర వర్ణ భగవానుడు క్రోధితుడై అసురసేనపై తన పాశమును వదలెను. ఆ పాశము అసురుల కంఠమును బిగించి వారిని యమలోకమునకు పంపెను. అంతటా హాహాకారములు చెలరేగెను. అసురులు యుద్ధము చేయబోగ ధూమ్రవర్ణ భగవానుని పాశ తేజోజ్వాల యందు అందరూ భస్మమయ్యిరి.

అహంతాసురుడు భయముతో శుక్రాచార్యుని సమీపించగా ధూమ్రవర్ణ భగవానుని శరణు వేడుమని ప్రేరేపించెను. అంతట అహంతాసురుడు భగవానుని చరణములపైబడి క్షమింపుమని ప్రార్థించెను.

భగవానుడు దైత్యునకు అభయమొసగి "ఎచట నాపూజ జరుగునో అచటికి నీవు పోరాదు. నా భక్తులను కష్టపెట్టరాదు" అని ఆదేశించెను.

అహంతాసురుడు భగవానుని చరణములకు ప్రణామము గావించి వెళ్ళిపోయెను.

దేవతలు ముక్త కంఠముతో భగవానుని స్తుతించి పూజించిరి.

(అష్టవినాయకులు సంపూర్ణము)

---

17వ పేజి తరువాయి ......

శ్రీ భర్తృహరి ఈ క్రింది శ్లోకములో 'ధరిద్రుడు' అనిన పదమునకు నిర్వచనము నిచ్చినాడు :

**శ్లో॥ స తు భవతు దరిద్రో యస్య తృష్ణా విశాలా ।**

**మనసి చ పరితు ష్టే కోऽ ర్థవాన్ కో దరిద్రః ॥ (భర్తృహరి)**

'ఎవడు విశాలమైన తృష్ణ (ఆశ)ను కల్గిఉంటాడో వాడే ధరిద్రుడు. మనస్సు తృప్తిని జెంది సంతోషముగా ఉన్నయడల 'ధనికుడు' 'ధరిద్రుడు' అనెడి భేదమెక్కడ ఉన్నది ?

అందుచేత ఉన్నదానితో తృప్తిపడడమే సుఖించడానికి రాజమార్గం కాని ధనాన్ని వృద్ధిజేసి కొనుట కాదు.

తృష్ణ లోభం వలన సంభవించు అనర్థములను ఈ క్రింది సూక్తి స్పష్టముగా వివరించుచున్నది :

**శ్లో॥ లోభాత్ క్రోధః ప్రభవతి లోభాత్ కామః ప్రజాయతే।**

**లోభాన్ మోహశ్చ నాశశ్చ లోభః పాపస్య కారణమ్ ॥**

'లోభము వలన క్రోధము జనించుచున్నది. లోభము వలననే కామం (విషయ భోగ లాలస) మరియు మోహము కూడా జనించుచున్నవి. లోభము వలననే మనిషికి నాశనము సంభవించును. లోభమే మానవుడు చేయు సర్వపాపములకు మూల కారణము

కాబట్టి, ప్రతి మానవుడు సర్వానర్థములకు కారణమయిన తృష్ణను త్యజించి, వైరాగ్యము నభివృద్ధిచేసికొని బడసి, జీవితమును సుఖమయ మొనర్చుకొను గాక! యని సనాతన ధర్మము నిర్దేశించుచున్నది.


> కుండ నీటిలో ముంచినపుడు అది మునిగిపోయే ముందు బుడబుడమని శబ్దం వస్తుంది. నిండిన తదుపరి శబ్దరహితంగా ఉంటుంది. అట్లే జ్ఞానసముపార్జనలో నున్న మొదటి దశలో మనిషి వాదనలతో గడుపును. పూర్ణ జ్ఞానమును పొందినంతనే మౌనమును ఆశ్రయించును



ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలలో

# దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు

## పేరవరం (ఆంధ్రప్రదేశ్ - తూర్పుగోదావరి)



శ్రీ రోహిణి మహేష్, M.A., L.L.B., కన్నావారి తోట 2వ లైను, 27-9-54, గుంటూరు - 522 004

కాకినాడ, ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా కేంద్రం. ఇక్కడ శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, బీచ్, మ్యూజియం ఉన్నాయి.

**శ్రీ బాలా త్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం**

పిఠాపురం మహారాజు వారు ఇచ్చిన ఖాళీ స్థలంలో క్రీ.శ. 1884లో శ్రీ హేజీబు భీమయ్య (భీమ శంకరుడు) నిర్మించినారు. వీరు అమ్మవారి ఉపాసకులు. అమ్మవారు వీరికి కలలో కనిపించి ఆలయం నిర్మించమని ఆదేశం ఇచ్చారు. అమ్మవారు వీరింటికి వచ్చి గాజులు వేయించుకున్నట్లు చెబుతారు. అమలాపురం మండలంలో పేరూరు గ్రామానికి చెందిన పేరి నరసింహశాస్త్రి ఆలయ శ్రీకృష్ణ చక్రం గీసినారు. భీమయ్య ఆలయం ముందు కోనేరు నిర్మించారు.

ఇక్కడ ఆలయంలో భద్రకాళి వీరభద్రస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, శ్రీ విఘ్నేశ్వరుడు, చండేశ్వరుడు, దత్తాత్రేయ, పాండురంగస్వామి విగ్రహాలున్నాయి. శ్రీ సూర్యనారాయణస్వామి, అయ్యప్పస్వామి, ఆలయాలుకూడా ఆ ఆలయానికి దగ్గరలో కలవు.

చైత్ర శుద్ధ ఏకాదశి నుండి కళ్యాణ మహోత్సవాలు జరుగుతాయి. అమ్మవారికి శ్రావణ శుక్రవారాల్లో అసంఖ్యాకంగా భక్తులు దర్శించి పూజలు నిర్వహిస్తారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలు విజయదశమి వరకు శరన్నవరాత్రి మహోత్సవాలలో రోజుకో అవతారంతో అమ్మవారిని అలంకరిస్తారు.

మొదటి రోజున విల్లంబులతో

రెండవ రోజున ఊయలలో

మూడవ రోజున పుస్తకాలతో

నాలుగవ రోజున వీణాపాణితో

ఐదవ రోజున జపమాలతో

ఆరో రోజున సింహావాహనంతో

ఏడవ రోజున రక్త బీజాక్షుని వధతో

ఎనిమిదవ రోజున శుంభని శుంభులవధతో

తొమ్మిదవ రోజున మహిషాసుర మర్థనితో అలంకరిస్తారు.

చివరి రోజున శమీపూజ చేస్తారు.

శ్రీరామ లింగేశ్వరస్వామి వారికి పలు రకాల నృత్యాలతో బాణసంచాతో గొప్ప వేడుక జరుగుతుంది. ఎదురుగా ఉన్న పుష్కరిణిలో తెప్పఉత్సవం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ.

**శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం**

క్రీ.శ. 1966లో భక్తులచే స్వామివారి ఆలయం జగన్నాదపురం ఉప్పటేరు వంతెన ప్రక్కన నిర్మించబడింది. ప్రతి సంవత్సరము ధనుర్మాసము నెలరోజులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారికి చామంతి పుష్పములు, పూజలు ప్రత్యేక గ్రామోత్సవ పూజలు వైభవంగా

జరుగుతాయి. భోగిపండుగరోజున గోదాదేవి కళ్యాణమహోత్సవములు జరుగుతాయి.

**బీచ్**

దేశవిదేశీ నౌకలు ఒడ్డుకు 8 కి.మీ. దూరంలో ఆపి చిన్న బోట్ల ద్వార సరుకులను సరఫరా చేస్తుంటారు. సముద్రం ఒడ్డునుంచి చీకట్లో ఓడలను చూస్తుంటే నౌకలలోని వెలుగు నక్షత్ర మండలంలో కనిపిస్తుంది. నౌకలకు దారి చూపడానికి ఇక్కడ నెలకొల్పిన లైట్ హౌస్, లక్షల నొక్కలింగాల శివాలయం, ఆదికుంభేశ్వరుని ఆలయం చూడదగినవి.

సముద్రం ఒడ్డునుంచి 15 కి.మీ. దూరంలో ఉన్న హోప్ ఐలాండ్ ప్రాంతం సందర్శకులకు కనువిందు చేస్తుంది. చిన్నదీవిగా ఉన్న ఈ ప్రాంతానికి చేరడానికి మత్స్యశాఖ అధికారుల అనుమతి తీసుకోవలసి ఉంది. చిన్న లాంచిలో మూడు గంటలపాటు సముద్ర ప్రయాణం చేస్తే హోప్ ఐలాండ్ ప్రాంతానికి చేరుకుంటాం.

రాత్రిపూట నౌకలకు మార్గం చూపడానికి వీలుగా క్రీ.శ. 1878లో స్థానిక సూర్యారావుపేటలో ఏర్పాటు చేసిన లైట్ హౌస్ నేటి సాంకేతిక అభివృద్ధికి సవాల్‌గా నిలుస్తుందనడంలో సందేహంలేదు. కిరసనాయిల్ ద్వార వెలిగే లైటుతో సుదూరంగా ఉన్న ఓడలకు నావికులకు దారి చూపిస్తుంది. ఎలాంటి విద్యుత్ అవసరంలేకుండా కేవలం కిరోసిన్ దీపం ద్వార ఇంతవెలుగు ఎలా వస్తుందనేది ఇప్పటికీ జవాబు లభించని ప్రశ్నే! సుమారు 20 మైళ్ళ దూరంలోని ఓడలకు ఈ వెలుగు నిరంతరాయంగా దిశానిర్దేశం చేయడం గొప్ప విషయం. విహారయాత్రికులు సమీప ప్రాంతవాసులు లైట్ హౌస్ పక్కనున్న నీటి వనరులతో దాహార్తి తీర్చుకుంటారు. సంవత్సరం పొడవునా ఈ ప్రాంతంలో నీరుండడం విశేషం. ఈ లైట్ హౌస్ 92 అడుగుల ఎత్తున ఉండి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పకడ్బందీగా నిర్మించారు.

కార్తీక మాసంలో ఆది కుంభూశ్వర ఆలయంలో కుంభాభిషేకం నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ ముఖద్వారంలో రాక్షస రాజు, రావణబ్రహ్మ విగ్రహం, లోపల భారీ నందీశ్వర విగ్రహాలు మరియు వివిద దేవతా విగ్రహాలు కలవు. వీటిని చూనన్నన్నంతసేపు చూపరులకు మరోయుగంలో గడిపే అనుభూతి కలుగుతుంది. వలయాకారంగా ఉండే ఈ ఆలయం లోపలికి వెళ్ళితే సముద్రమధ్యలో నిలుచున్నట్లు ఉంటుంది.

బీచ్‌కు సమీపంలో క్రీ.శ. 1922లో నిర్మలానంద భారతిచే నిర్మించబడిన ఈ ఆలయం కాలక్రమంలో వెయ్యి లింగాల శివాలయంగా ప్రసిద్ధికెక్కింది. కాత్యాయిని సమేత కైలాస సహస్ర మహారామలింగేశ్వరస్వామితో పాటు ఈ ఆలయంలో 1001 లింగాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. రెండంతస్తులుగా నిర్మించిన ఆలయ క్రింది భాగంలో 1001 లింగాలకు పై భాగంలో కాత్యాయిని మహాలింగేశ్వరుని ప్రతిష్టించారు. లింగంపై వేసే సమస్త అభిషేక పదార్థాలు క్రింద భాగంలోని 1001 లింగాలపై పడటం దీని ప్రత్యేకత. ప్రతి శివాలయం పైభాగాల్లో గోపురాలతో నిర్మితమై ఉండగా ఆలయం గోపురస్థానం లింగాకృతితో నిర్మితం కావడం మరో విశేషం. ప్రత్యేక పూజలు దోష నివారణ కోసం ఈ గుడికి వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది జనులు వస్తుంటారు.

**మ్యూజియం**

ఇక్కడ రాష్ట్ర పురావస్తుశాఖ నిర్వహిస్తున్న ఆంధ్రసాహిత్య ప్రదర్శనశాలలో క్రీ.శ. 14 మరియు 15వ శతాబ్దాలకు చెందిన విగ్రహాలున్నాయి. □

# వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు

డా॥ టి. చంద్రశేఖరం, తిరుపతి. 9701181966

**పానీయాలు :**

**20.** లావుగా ఉన్న తిప్పతీగ కొమ్మలను తొక్కతీసి ముక్కలుగా చేసి ఎండించి పొడి చేసుకొనవలెను. బెల్లం, నెయ్యి కలిపి పాకము చేసుకొని అందులో తేనె, తిప్పతీగ చూర్ణము కలిపి రేగు గింజంత మాత్రలు చేసుకొని పాలు అనుపానముగా రోజుకు ఒకసారి తీసుకొనిన అమిత బలము కలుగును. రోగ నిరోధకశక్తి పెరుగును.

**21. మేడిచెట్టు** (అత్తిచెట్టు) యొక్క వేరును జానెడుండునట్లు నరికి చెట్టుకున్న వేరుకు కుండను గానీ, జాడీనిగాని జొనపవలెను. పిమ్మట చెట్టునకు వట్టి గుడ్డ చుట్టి మంటపెట్టవలెను. చెట్టు రసము వేరు ద్వారా కుండలోనికి దిగును. ఆ రసము వంటికి పూసుకొనిన కుష్ఠములు మానును. చర్మరోగములు హరించును. దీనిని లోనికి కూడా త్రాగవచ్చును.

**22.** సునాముఖి ఆకు రసాయన ద్రవ్యమైనది. సునాముఖి ఆకు చూర్ణము పావు తులము తేనెతో సునాముకి ఆకు చూర్ణము పావు తులము పంచదారతో కలిపి ప్రతినిత్యము సేవించుచుండిన యెడల 40 దినములలో రొమ్ముునొప్పి హరించి నీరసము తగ్గును.

**23.** వేపచెట్టు యొక్క పూలు, పండ్లు, ఆకులు, జిగురు, బెరడు, కరక్కాయ పెచ్చులు, ఉసిరిక వలుపు, తాటికాయ పెచ్చులు, నల్ల జీలకర్ర, సైంధవ లవణము, చిన్న పిప్పళ్ళు, మునగ చెట్టుఆకులు. ఈ వస్తువులన్నియు నాలుగు తులాల చొప్పున తీసుకొని చూర్ణముగావించి అందు అడ్డసరపు ఆకు రసము పోసి మర్ధించి మొత్తము 360 మాత్రలు చేయవలెను. ప్రతిరోజూ ఉదయం ఒక మాత్ర మంచినీటితో అనుపానముగా సేవించుచుండిన వృద్దులకు కూడా యౌవనము కలుగును. బలము కలుగును. ఉప్పు, పాలు, పెరుగు పులుపులను మానవలెను. ఈ మాత్రలు విడవకుండా సంవత్సరము పొడవునా సేవించాలి.

**24. రక్తశుద్ధి రసాయనము :** సర్వతి ఆకులు 12 తులాలు, తమలపాకుల తీగ వేర్లు 1 తులము, వాము 1 తులము, పిప్పళ్ళు 1 తులము. ఈ వస్తువులను తమలపాకు రసంతో మర్ధించి గురిగింజ వలె మాత్రలు చేయవలెను. రోజుకు 3 పూటలా 3 మాత్రలు సేవించుచుండిన 40 దినములలో రక్తము పరిశుభ్రమై సర్వవ్యాధులు నశించును.

**25. మృత్యుయోగము :** పుష్యమీ నక్షత్రము ఆదివారం రోజున తిప్పతీగ వేరును తీసుకొని ఆ వేరు నూరిన ముద్దను ఒక తులమెత్తువెచ్చటి నీటిలో కలిపి రోగికి త్రాగించిన మృత్యు ముఖమున నున్న వారు కూడ రక్షించబడుదురు.

**26. నాసా రోగ రహిత చూర్ణము :** కరకర్కాయపెచ్చులు, ములగ చెక్క, గానుగ చెక్క, జిల్లేడు వేర్ల చెక్క, తెల్లగలిజేడు మూలం, శొంఠి, సైంధవలవణము. ఈ వస్తువులను సమభాగాలుగా తీసుకొని చూర్ణించి పూటకు, పావు తులం చూర్ణము చొప్పున తినుచుండిన మూత్రవ్యాధులు, కేన్సర్ వ్యాధి, గండమాలలు, మలబద్ధకము, అజీర్ణము, జ్వరము మొదలైన వ్యాధులు నశించును.

# వాస్తు- సైన్స్

.... ఆళ్ళ రామకృష్ణ., రాజేంద్రనగర్, గుంటూరు. 9492464366

ప్రస్తుతము వార్తలలో ప్రధానాంశంగా వున్న ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతము తుళ్ళూరుకు దగ్గరలోనున్న విజయవాడ పట్టణ వాస్తు విషయాల గురించి విశ్లేషించుకుందాం. విజయవాడకు పడమరలో నున్న కనకదుర్గ కొండ, వాస్తుపరంగా, ఆ పట్టణానికి పెద్ద అండగా చెప్పుకోవచ్చు. దక్షిణంగా వున్న కృష్ణానది, విజయవాడ వాస్తుకు భంగం కల్గిస్తుందని చాలా మంది వాస్తు పండితులు చెప్పిన మాట కొంత వరకు నిజమయినప్పటికిని, తరువాత క్రమంలో కృష్ణానది మీద ప్రకాశం బ్యారేజి ఆనకట్ట నిర్మించబడి, బందరు కాలువ మరియు ఏలూరు కాలువలు ఈశాన్యం వైపు సాగటంతో విజయవాడ ప్రాంతములో గణనీయమైన వ్యాపారాభివృద్ధిని గమనించడం జరిగింది. విజయవాడకు నైఋతి ప్రాంతములోనున్న పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రాంతము ఒకానొక కాలములో పెద్ద గొయ్యి. ఆ కాలములో విజయవాడ ప్రాంతములో గూండాయిజం, రౌడీయిజం ప్రబలి, మారణకాండలు సాగుతూ వుండేవి. పండిట్ నెహ్రూ బస్టేషన్ మంజూరు కాగానే, ఆ గొయ్యి పల్లపు ప్రాంతమంతా కప్పబడి, నైఋతి ఎత్తుగా తయారైంది. నైఋతి ఎత్తుగా వుండటం, ఈశాన్యంవైపు కాలువలు పారుతుండటంతో, ఏలూరు వైపుకు వెళ్ళే హైవే కూడ ఈశాన్యం వైపు వెళ్ళుతుండటంతో, విజయవాడ నగరం దేశంలోనే పేరుపొందింది. మెడికల్ కాలేజి అనేక ఇంజనీరింగ్ కాలేజీలు, పోస్టు గ్రాడ్యుయేట్స్ సెంటర్స్, డిగ్రీ కాలేజీలు, కోచింగ్ సెంటర్స్, కాన్వెంటులు, ఒకటేమిటి, అన్ని విధాలుగా, విద్యాపరంగా తన ఘనతను చాటుకోవడం జరిగింది. ఇవన్నీ వాస్తుపరంగా, మన ఎదురుగా జరిగిన మార్పు చేర్పులే.

ఇదే సమయములో మనం మన ప్రియతమ భారతదేశ ఉచ్ఛ దశ గురించిన ఒకానొక విషయాన్ని మన పాఠకులతో పంచుకోవటాన్ని, వాస్తు విశిష్ఠత తెలియపరచటానికి ఉపయోగించుకుంటాను. కొన్ని శతాబ్దాల క్రితం, భారతదేశపు ఉత్తర ప్రాంతంలో టెతిస్ అనే మహా సముద్రం ఉండేది. ఆ సమయములో మన భారతదేశం, ధనధాన్యాలతో, తులతూగుతూ వుండేది. ముత్యాలు, రత్నాలు రాసులు పోసి అమ్మేవారట. అదే సమయములో, ఋషి సాంప్రదాయం వెల్లి విరిసేదట. ఒకవైపున భౌతికంగా సిరిసంపదలు, మరోవైపు ఆధ్యాత్మికతతో మన భారతదేశం నిండివుండేది. కాలక్రమేణా, భూమి పొరలలో వచ్చే మార్పులతో, టెతిస్ సముద్రం కనుమరుగయి ఉత్తరాన హిమాలయాలు పెరగడంతో, మనదేశం కొంత కాలం పరాయి పాలనలో ఉండటం, మన దేశ సంపద అంతా కొల్లగొట్టబడటం జరిగింది. ఇవన్నీ, వాస్తు అనేది, ఈ భూమికి ఎంత ప్రధానాంశం అనేది మనకు తెలియజేస్తుంది.

ప్రస్తుతము, ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ప్రకటించబడిన తుళ్ళూరు, విజయవాడ పట్టణానికి నైఋతి దిశలోవుంది. ఆకాశహర్మ్యాలు నిర్మించాలనే ఆలోచనతో వున్నారు. దీనివలన, నగరములోనికి కృష్ణానది నుండి నీటి ప్రవాహ దోషం కూడ తగ్గే అవకాశంవుంది. అంటే వాస్తు పరంగా బలం పెరుగుతుందన్న మాట. ఇక రాజధాని విషయం కొస్తే ఉత్తరాన వున్న కృష్ణానది, వాస్తుపరంగా తిరగులేని విజయాలను కలుగజేస్తుంది. ప్రస్తుతం నిర్మించబోయే రాజధానివలన, విజయవాడకు, విజయవాడ వలన రాజధానికి ఎన్నో లాభాలుంటాయి అని చెప్పటంలో అతిశయోక్తిలేదు. రాబోయే కాలంలో, ఈ రెండూ మంచి నగరాలుగా అభివృద్ధి చెందుతాయి అనటంలో ఎటువంటి సందేహంలేదు. వాస్తు విశేషాలు ఎలాంటి మార్పులు చేర్పులు కల్పిస్తాయి అని చెప్పటానికిది ప్రత్యక్ష ఉదాహరణ. భౌగోళిక అంశాలను మార్చటం సాధ్యంకాదు. కాని, వాటి కనుగుణంగా, నిర్మాణాలను చేపట్టటం మన చేతిలో పని వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని, ప్రతి నిర్మాణ ప్రారంభంలోను వాస్తు శాస్త్రమును పరిగణనలోకి తీసికొని మన పాఠకులందరు అన్ని విధాలా సకల సౌభాగ్యాలు పొందాలని ఆశిస్తూ..□

# శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి మాలాదీక్ష

## ప్రియపరిపూర్ణాత్మబంధువులందరికీ శుభ ఆహ్వానము

శ్రీ అచలానంద ఆశ్రమము, ఒంగోలు నందు దీక్షలు ఇవ్వబడును. ఆసక్తి గల భక్తులందరూ మాలాదీక్షను స్వీకరించి శ్రీగోవిందమాంబా వీరబ్రహ్మేంద్రుల కృపకు పాత్రులు కాగోరుచున్నాము.

## మాలాదీక్ష , మరియు జపయజ్ఞ దీక్షలు ప్రారంభము

**21.03.2015 ఉగాది పర్వదినము నుండి ప్రారంభమగును.**

**32రోజుల దీక్ష : 27.03.2015 నుండి**

**21రోజుల దీక్ష : 07.04.2015 నుండి**

**12రోజుల దీక్ష : 16.04.2015 నుండి**

### దీక్షానియమములు

1. కాషాయ వస్త్రములు, మెడలో రుద్రాక్షమాల, నుదుట విభూతి, గంధము, కుంకుమను సర్వవేళల ధరించవలెను.
2. దీక్షస్వీకరించిన భక్తులు బ్రహ్మచర్యమును పాటిస్తూ నేలమీద చాపపై పరుండవలెను.
3. ఉదయం, సాయం సమయములందు స్నానాదుల నాచరించి శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి మూల మంత్రమును 108సార్లు విధిగా జపించవలెను. లఘుపూజ, కర్పూరనారికేళములతో స్వామికి నివేదన సమర్పించి భక్తులందరికీ ప్రసాద వినియోగము చేయవలెను.
4. సత్యము, జ్ఞానము, ధర్మము, శాంతము, క్షమ, నియమము అను ఈ షడ్విధులను పాటించవలెను.
5. సోదరభావముతోమెలగుట, పరుషవాక్యములుమాట్లాడకుండుట, శాంతస్వభావము కలిగియుండవలెను.
6. మద్యము, మాంసము, ధూమపానము మొదలగు నిషిద్ధ పదార్థములను విసర్జించవలెను.
7. భక్తి ప్రపత్తులతో నిరంతరం స్వామినామమును స్మరించుచుండుట, వీలైన ఎక్కువ సమయాన్ని మౌనంగా గడుపుట శ్రేష్టము. అశౌచముగా నున్న వారిండ్లకు పోరాదు.
8. విరామ సమయములందు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి చరిత్ర, కాలజ్ఞానము పారాయణము చేయుట, స్వామివారి నామస్మరణను చేయుట విధిగా పాటించవలెను.
9. ఇతరులను సంబోధించునపుడు, సంభాషించునపుడు బ్రహ్మముస్వామి అని లేక ఓం ప్రశాంతిః అనిగాని ఉచ్చరించవలెను.
10. శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి భక్తులు చేయు పూజలలో తప్పక పాల్గొనవలెను. దీక్షాపరులు సామూహికంగా దీక్ష చేయుట మంచిది.
11. దీక్షాకాలంలో పాదరక్షలు, గొడుగులు మొదలైనవి వాడరాదు. కేశఖండనం చేయరాదు.
12. దీక్షపాటించుటకు కులమతభేదాలులేవు. స్త్రీపురుషులందరున్నూ, మరియు దంపతులున్నూపొందవచ్చును

**శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి ఆరాధన పర్వదినము తేది 28.04.2015** న మాలాదీక్షను విసర్జించవలెను

**ఉగాది పర్వదినము మొదలు వై.శు.దశమీ శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి ఆరాధన పర్వదినము వరకు ఆశ్రమములో ప్రతిరోజు మహాత్ముల ఉపన్యాసములు, ప్రత్యేక పూజలు, సామూహిక పారాయణ మరియు ఇతర విశేష కార్యక్రమములు జరుగును.**

**గమనిక:** మాలాదీక్ష స్వీకరించిన బ్రహ్మం స్వాములకు ఉగాది పర్వదినము నుండి ఆరాధన మహోత్సవముల వరకు శ్రీగోవిందమాంబా ప్రసాదశాల నందు భిక్ష (భోజన వసతి) ఏర్పాటు చేయబడును.

**శ్రీగోవిందమాంబా వీరబ్రహ్మేంద్ర మహాపీఠం, అచలానంద ఆశ్రమం, మంగమూరురోడ్డు, ఒంగోలు**